ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

సూర్యాపేట

5

గురువారం 23 అక్టోబరు 2025




గరిష్ఠం 29.5
కనిష్ఠం 22.8

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	587.50 (305.8030)	52,560	52,560
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	644.42 (4.31)	1,517.58	1,764.88
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	173.554 (43.548)	25,230	24,230

చికెన్ ధరలు | లైవ్ : రూ.145 | డ్రెస్ : రూ.220 | స్కిన్‌లెస్ : రూ.250

స్థానం పదిలం కోసం..



- ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న విద్యాశాఖ
- ప్రతి విద్యార్థిపై ఉపాధ్యాయుల ప్రత్యేక దృష్టి
- ప్రస్తుతం సాయంత్రం గంట ప్రత్యేక తరగతి
- జనవరి నుంచి ఉదయం కూడా అదనపు తరగతులు

పదో తరగతి ఫలితాల్లో జిల్లా ఉత్తమ ర్యాంకు సాధించేలా జిల్లా విద్యా శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. ముందస్తు ప్రణాళికతో విద్యార్థులకు పాఠ్యాంశాల బోధన,పునశ్చరణ తరగతులను నిర్వహిస్తున్నారు. చదవడం, రాయడం, ఆటపాటలు నేర్పించడంతోపాటు పరీక్షల భయాన్ని తొలగించేందుకు కృషి చేస్తున్నారు. సెప్టెంబరు నుంచి సాయంత్రం గంటపాటు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తుండగా జనవరి నుంచి ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నారు.

- (ఆంధ్రజ్యోతి-సూర్యాపేట టౌన్)

జిల్లాలో ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను నిలిపేందుకు విద్యాశాఖ అధికారులు ప్రయత్నిస్తున్నారు. ప్రాథమికంగా విద్యార్థుల నమోదును పెంచేందుకు అనేక కార్యక్రమాలు చేపట్టారు. ఉపాధ్యాయులు బడిబాటతో పాటు గ్రామాల్లో పర్యటిస్తూ ప్రభుత్వ పాఠశాల్లో సౌకర్యాలను వివరిస్తూ విద్యార్థుల నమోదును గణనీయంగా పెంచారు. అయితే విద్యార్థుల నమోదు పెరిగినంత మాత్రాన ఉపయోగం లేదని, ప్రైవేట్ పాఠశాలల కంటే మెరుగైన విద్యనందించి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు తక్కువేమీ కాదని నిరూపించేందుకు జిల్లా విద్యాశాఖ నూతన ఒరవడికి శ్రీకారం చుట్టింది.

ప్రాథమిక అభ్యాసం నుంచి...

విద్యాబోధనతో పాటు విద్యార్థుల్లోనూ నైపుణ్యాలను పెంచేందుకు అధికారులు ప్రత్యేక కార్యాచరణ చేపట్టారు. విద్యార్థులకు రాయడం, చదవడం, ఆటపాటలు నేర్పించడం, వారిలో పరీక్షల భయాన్ని పోగొట్టడం, విజ్ఞానానికి తోడ్పడే అంశాలు చెప్పడం, చేయించడం, చదువంటే ఆసక్తి కలిగేలా తీర్చిదిద్దడం లాంటి కార్యక్రమాలను చేపడుతున్నా రు. దీంట్లో భాగంగా పద వ తరగతి విద్యార్థులకు సెప్టెంబరు 1వ తేదీ నుంచి నుంచి సాయంత్రం అదనంగా గంట వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. 4.20 గంటల నుంచి 5.20 గంటల వరకు ప్రతి రోజూ ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. డిసెంబరు చివరివరకు ఈ తరగతులను నిర్వహించనున్నారు. అదేవిధంగా జనవరి 1వ తేదీ నుంచి వార్షిక పరీక్షలకు వరకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతు లు నిర్వహిస్తారు. ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకు తిరిగి సాయంత్రం 4.20 నుంచి 5.20 వరకు ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నారు.

గతానికంటే మెరుగ్గా...

పదవ తరగతిలో మెరుగైన ఫలితాల కోసం జిల్లా యంత్రాంగం పకడ్బందీగా కార్యాచరణను అమలు చేస్తోంది. 2024-24 విద్యాసంవత్సరానికి పదో తరగతిలో 96.81 శాతంతో జిల్లా 14వస్థానం దక్కించుకుంది. ఈ పర్యాయం జిల్లాకు ఉత్తమ ర్యాంకు సాధించేలా విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించారు. ఇప్పటికే పదవ తరగతి విద్యార్థులకు సంబంధించిన సిలబస్ పూర్తి చేసేలా ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. అంతేకాకుండా వార్షిక పరీక్షల్లో విద్యార్థులు ఎలాంటి భయాందోళనకు గురికాకుండా పరీక్షలను మంచిగా రాసి ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఇప్పటికే పలుమార్లు చిన్నచిన్న పరీక్షలు నిర్వహించారు.

విద్యార్థులపై ప్రత్యేక దృష్టి

పదో తరగతి చదివే ప్రతీ విద్యార్థిపై ఉపాధ్యాయులు..

- మిగతా 8వ పేజీలో..

ఉత్తమ ఫలితాల సాధనే ధ్యేయం

పదో తరగతిలో ఉత్తమ ఫలితాల సాధన కోసం కృషి చేస్తున్నాం. పిల్లలకు గుణాత్మకమైన విద్యనందించి వారిని ఉన్నతులుగా తీర్చిదిద్దేందుకు సరికొత్త కార్యాచరణ రూపొందించాం. గతంలో కంటే ఈఏడాది పదో తరగతి పరీక్షల్లో 100 శాతం నాణ్యమైన ఫలితాలు రాబట్టేందుకు చర్యలు చేపడుతున్నాం. ఉన్నత స్థాయి వినూత్న విద్యా ప్రణాళికతో విద్యార్థులకు ఉత్తమ విద్య, ఉన్నత ప్రమాణాలు అందిస్తున్నాం.

- అశోక్‌కుమార్, డీఈవో, సూర్యాపేట



ఆలయాల్లో కార్తీక పూజలు ప్రారంభం



సూర్యాపేటటౌన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం ప్రారంభం కావడంతో బుధవారం జిల్లావ్యాప్తంగా ఆలయాల్లో వేకువజాము నుంచి భక్తులు ఆలయాల్లో పూజలు నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని అన్నపూర్ణ సహిత విశ్వనాథ స్వామి, వేంకటేశ్వరస్వామి, పిల్లలమర్రి శివాలయం, శ్రీరామలింగేశ్వర, పాత శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శివ, నారాయణుడి నామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. జిల్లా కేంద్రంలోని శబరినగర్ అయ్యప్ప, పిల్లలమర్రి ఆలయాల్లో అయ్యప్ప, శివయ్య మాలలు ధరించారు. భక్తులకు అసౌకర్యాలు కలుగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. శివాలయాల్లో శివలింగాలకు పంచామృత అభిషేకాలు, అర్చన లు, నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం దేవాలయాల్లో ఆకాశదీపం వెలిగించారు. ఆకాశదీపాన్ని భక్తులు దర్శించుకున్నారు.



పూజల్లో పాల్గొన్న శివమాలధారులు



సూర్యాపేట మార్కెట్‌లో ధాన్యం రాశులు

సూర్యాపేట మార్కెట్‌కు ధాన్యం రాక

భానుపురి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌కు వానాకాలం సీజన్ ధాన్యం రాక మొదలైంది. వరి కోతలు మొదలుకావడంతో మార్కెట్‌కు ధాన్యం వస్తోంది. పంటకు మంచి ధర ఇచ్చేందుకు మార్కెట్ కమిటీ, అధికారులు ముందస్తుగానే ప్రణాళికలు సిద్ధం చేశారు. నాణ్యతా ప్రమాణాలతో కూడిన ధాన్యంలో గ్రేడ్-1 రకానికి క్వింటాకు రూ.2,389, సాధారణ రకానికి రూ.2,369 ఇవ్వాలని కమీషన్‌దారులకు, ఖరీదుదారుల సమీక్షా సమావేశంలో నిర్ణయించారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ ధాన్యాన్ని రైతులు తీసుకురావాలని సూచిస్తున్నారు. మార్కెట్‌లో రైతుల అవసరార్థం ధాన్యం తూర్పార బట్టే యంత్రాలను సిద్ధంగా ఉంచారు.

మార్కెట్‌కు 5,631 బస్తాల వ్యవసాయ ఉత్పత్తులు

సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌కు బుధవారం 117 మంది రైతులు 5,631 బస్తాల వ్యవసాయ ఉత్పత్తులను తీసుకువచ్చారు.

రకం	బస్తాలు	అత్యధికం	అత్యల్పం
ఐఆర్-64	2,836	రూ.1,879	రూ.1,611
బీపీటీ	1503	రూ.2,479	రూ.1808
జైశ్రీరాం	912	రూ.2,869	రూ.1,739
హెచ్ఎంటీ	55	రూ.1,889	రూ.1,726
కందులు	44	రూ.6,349	రూ.6,189
పెసళ్లు	48	రూ.6,593	రూ.3,389
వేరుశనగ	72	రూ.5,679	రూ.4,559
జొన్నలు	161	రూ.1,822	----------

నాణ్యతా ప్రమాణాలతో ఉత్పత్తులు తీసుకురావాలి

నాణ్యతా ప్రమాణాలతో రైతులు ధాన్యం తీసుకురావాలి. సీజన్ ధాన్యం మార్కెట్‌కు రాక ప్రారంభమైంది. మార్కెట్‌లో ధాన్యం తూర్పార బట్టేందుకు యంత్రాలను అందుబాటులో ఉంచాం. రైతులు పచ్చిధాన్యం నేరుగా తీసుకురావడం వల్ల ధర రాదు. ఆరబెట్టుకుని తీసుకురావాలి.

- ఫసియొద్దీన్, మార్కెట్ సెక్రటరీ

నిరుద్యోగుల జీవితాల్లో వెలుగులు

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని ఇంజనీరింగ్, పీజీ, డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లు, కరస్పాండెంట్ల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పక్కన కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, ఎస్పీ నర్సింహ

సూర్యాపేట(కలెక్టరేట్), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపడానికి తనవంతుగా కృషి చేస్తున్నానని రాష్ట్ర భారీ నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఈనెల 25వ తేదీన హుజూర్‌నగర్‌లో డీట్, సింగరేణి కాలరీస్ సౌజన్యంతో నిర్వహిస్తున్న మెగా జాబ్ మేళాకు సంబంధించి బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, ఎస్పీ నర్సింహతో కలిసి ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలతో నిర్వహించిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. అర్హులందరికీ రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు స్పష్టం చేశారు. అందుకోస హుజూర్‌నగర్ పట్టణంలో మెగా జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈమేళాకు 250 వివిధ ప్రముఖ కంపెనీలు హాజరవుతున్నాయని అర్హులైన వారికి ఇంటర్వ్యూలు నిర్వహించిన అవసరమైన వారికి వెంటనే ఉద్యోగ నియామక పత్రాలు అందజేస్తారన్నారు. జాబ్‌మేళాకు హాజరయ్యే యువత ప్రత్యేకంగా రూపొందించిన క్యూఆర్ కోడ్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఇప్పటి వరకు 12,480 మంది యువత రిజిస్ట్రేషన్ చేసుకున్నారని పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకోలేకపోయినా నేరుగా జాబ్‌మేళాకు హాజరుకావచ్చన్నారు.

జాబ్‌మేళాకు హాజరయ్యే వారికి ఉచిత రవాణా, భోజన సౌకర్యం కల్పిస్తున్నామ ని స్పష్టం చేశారు. విద్యాసంస్థల యాజమాన్యాలు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు జాబ్‌మేళాకు అధిక సంఖ్యలో నిరుద్యోగులు తరలివచ్చేలా వారికి అవగాహన కల్పించాలన్నారు. కళాశాలల యాజమాన్యాలకు ఏవైనా ఇబ్బందులు ఉంటే తనవద్దకు వచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. అంతకు ముందు కలెక్టరేట్ నుంచి ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఏవోలు, పోలీస్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో వీడియో కాన్ఫరెన్స్‌లో జాబ్‌మేళా విజయవంతానికై నిరుద్యోగ యువతను జాబ్‌మేళాలో పాల్గొనే విధంగా అవగాహన కల్పించాలని మాట్లాడారు. జాబ్‌మేళాకు సంబంధించిన ఏమైనా సందేహాలు ఉంటే మంత్రి ఓఎస్డీ ప్రవీణ్ సెల్. 9849050352ను సంప్రదించాలన్నారు. సమావేశంలో డీట్ డైరెక్టర్ రాజేశ్వర్‌రెడ్డి, అదనపు కార్పొరేషన్ రిలేషన్ డైరెక్టర్ వంశీధర్‌రెడ్డి, అదనపు ప్రోగాం డైరెక్టర్ చంద్రశేఖర్, మంత్రి ఓఎస్డీ ప్రవీణ్, అదనపు కలెక్టర్ కొలనుపాక సీతారామారావు, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు చెవిటి వెంకన్న యాదవ్, ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, పరిశ్రమల శాఖ జీఎం సీతారాంనాయక్, నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలు కల్పించేందుకే..

హుజూర్‌నగర్ : ప్రైవేట్ రంగంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు మెగా జాబ్‌మేళా ఏర్పాటు చేసినట్లు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. జాబ్‌మేళా నిర్వహించనున్న స్థలాన్ని బుధవారం పరిశీలించిన అనంతరం మున్సిపల్, రెవెన్యూ అధికారులతో సమీక్ష చేసిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. యువత జీవితాల్లో వెలుగులు నింపాలని, వారి కళ్లలో ఆనందం చూడాలని, జీవిత కాలంలో మీ కాళ్లపై మీరు నిలబడి కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేసుకోవాలని యువతకు పిలుపునిచ్చారు. యువతీ, యువకులకు ఉపాధి కల్పిస్తే ఆ కుటుంబాలు బలోపేతం అవుతాయన్నారు. ప్రజాప్రతినిధిగా ఎన్నికై ఐదేళ్ల పదవీ కాలంలో ప్రజలకు ఏదో ఒక మేలు చేయాలనే దృఢ సంకల్పంతో పనిచేస్తున్నామన్నారు. రాజకీయాలంటే దోచుకోవడం, దాచుకోవడం కాదని ప్రజలకు మేలు చేశామన్న సంతృప్తితో ఉండాలన్నారు. మరో రెండురోజుల్లో 3వేల మంది యువత రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం ఉందన్నారు. ట్రాఫిక్ సమస్య లేకుండా పార్కింగ్ స్థలాలు ఏర్పాటుచేశామన్నారు. ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోలేని వారికి పాత విజ్ఞాన్ స్కూల్, స్వర్ణవేదికలో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు.

అనంతరం కాంగ్రెస్ సోషల్ మీడియా ఇన్‌చార్జి, ఎస్సీ సెల్ నాయకులు దగ్గుపాటి బాబూరావు ఆధ్వర్యంలో జాబ్‌మేళా కరపత్రాన్ని మంత్రి ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంపత్‌రెడ్డి, రాము, రవీందర్, రమేష్, క్రాంతి తదితరులు పాల్గొన్నారు. అనంతరం క్యాంప్ కార్యాలయంలో సోషల్‌మీడియా ప్రతినిధులతో మంత్రి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ యువతీ, యువకులు పెద్ద సంఖ్యలో హాజ రయ్యేలా సోషల్ మీడియాలో ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమంలో హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాలకు చెందిన సోషల్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రభుత్వ లే అవుట్ స్థలాలు కాపాడాలి

హుజూర్‌నగర్‌రూరల్ : ప్రభుత్వ లేఅవుట్ స్థలాలను కాపాడాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కోరారు. బుధవారం పట్టణంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మునిసిపాలిటీ పరిధిలో ఉన్న లే అవుట్ స్థలాలను గుర్తించి వాటి చుట్టూ ఫెన్సింగ్ వేయాలన్నారు. ప్రభుత్వ భూములను కబ్జాచేసేందుకు ప్రయత్నిస్తే చర్యలు తీసుకోవాలన్నారు. లేఔట్ స్థలాలపై కోర్టు వివాదంలో ఉన్న స్థలాలపై ప్రభుత్వ వకీళ్లతో వాదించాలన్నారు.భవిష్యత్ తరాల అవసరాలను దృష్టి లో పెట్టుకుని లేఅవుట్ స్థలాలు, ఇతర ప్రభుత్వ భూములు స్వాధీనం చేసుకోవాలన్నారు. కార్యక్రమాల్లోఆర్డీవో శ్రీనివాసులు, కమిషనర్ కె.శ్రీనివాసరెడ్డి, సింగరేణి సంస్థ ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు తన్నీరు మల్లికార్జున్‌రావు, దొంగరి వెంకటేశ్వర్లు, అరుణ్‌కుమార్, గూడెపు శ్రీనివాసు, దొంతగాని శ్రీనివాసు, సంపత్‌రెడ్డి, చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, పాల్గొన్నారు.

వైద్యులకు నియామక పత్రాలు..

సూర్యాపేట(కలెక్టరేట్) : జాతీయ ఆరోగ్య మిషన్ ద్వారా జిల్లాలోని పీహెచ్‌సీలకు వైద్యాధికారులుగా నియామకమైన వైద్యులు ప్రణీత్‌నాయక్, ప్రతిమ, సాయిక్రిష్ణ, ఎన్. అమూల్యకు మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి బుధవారం కలెక్టరేట్‌లో నియామక పత్రాలు అందచేశారు. కార్యక్రమంలో కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, ఎస్పీ కొత్తపల్లి నర్సింహ, డీఎంహెచ్‌వో డాక్టర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ అమరవీరులకు నివాళి



హోంగార్డు మహేశ్వర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డి

సూర్యాపేటక్రైం, అక్టోబరు 22, (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరులకు సూర్యాపేట పోలీసులు బుధవారం నివాళులర్పించారు. సూర్యాపేట పట్టణానికి చెందిన అమరుడు హెడ్‌కానిస్టేబుల్ బడే సాహెబ్, హోంగార్డు మహేశ్వర్ ఇంటికి వెళ్లి వారి చిత్రపటాల వద్ద పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ పోలీస్ అమరవీరుల కుటుంబాలకు పోలీస్ శాఖ ఎల్లప్పుడు అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ నర్సింహాచారి, పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య, పోలీస్ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బెల్లకొండ రాంచందర్‌గౌడ్, ఆర్ఎస్ఐ సాయిరాం, పట్టణ ఏఎస్ఐ శంకర్ ఉన్నారు.

వైభవంగా లక్ష్మీనరసింహుడి కల్యాణం



మఠంపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మట్టపల్లి లక్ష్మీనరసింహ స్వామి నిత్య కల్యాణం వేదపండితులు బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాసన చేపట్టారు. .అనంతరం భక్తులకు నీరాజన మంత్రపుష్పాలతో మహానివేదన గావించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు చెన్నూరి విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈవో సిరికొండనవీన్, అర్చకులు భక్తులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగులకు బెనిఫిట్స్ చెల్లించాలి



కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న రిటైర్డు ఉద్యోగుల సంఘం నాయకులు

కోదాడటౌన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి) : విశ్రాంత ఉద్యోగులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం చెల్లించాల్సిన బెనిఫిట్స్‌ను అదే నెలలో చెల్లించాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రావెళ్ల సీతారామయ్య, విశ్రాంత ఉద్యోగుల బెనిఫిట్స్ సాధన కమిటీ జిల్లా అధ్యక్షుడు పొనుగోటి కోటయ్య డిమాండ్ చేశారు. 2024 తర్వాత రిటైరై బెనిఫిట్స్ మంజూరు కాక ఆందోళనతో మృతి చెందిన ఉద్యోగుల ఆత్మకు శాంతి చేకూరాలని బుధవారం కోదాడలో కొవ్వొత్తులతో నివాళులర్పించారు. అంతకుముందు బాలుర ఉన్నత పాఠశాల నుం చి రాజీవ్ సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉద్యోగ విరమణ పొందిన తర్వాత బెనిఫిట్స్ మంజూరు చేయకపోవడం తో కుమార్తెల వివాహాలు, అనారోగ్య సమస్యల ఖర్చులకు అప్పుల పాలవుతున్నారన్నారు. దీంతో అనేకమంది మనోవేదనకు గురై మృతి చెందారన్నారు. ప్రభుత్వం వెంటనే బడ్జెట్ మంజూరు చేసి విశ్రాంత ఉద్యోగులకు అందాల్సిన బెనిఫిట్స్ వారి ఖాతాల్లో జమ చేయాలన్నారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల బకాయిల సాధన కమిటీ కోదాడ డివిజన్ బాధ్యులు షేక్ బాలేమియా, విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి బొల్లు రాంబాబు, కోదాడ యూనిట్ అధ్యక్షుడు వేనేపల్లి శ్రీనివాసరావు, కార్యదర్శి రఘువరప్రసాద్, భద్రారెడ్డి, హుస్సేన్, మణిరం, రమేష్‌బాబు, భిక్షం, భ్రమరాంబ పాల్గొన్నారు.

విద్య, వైద్య రంగానికి ప్రభుత్వం పెద్దపీట



హెల్త్‌సబ్‌సెంటర్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సామేలు

నూతనకల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. మండలంలోని మిర్యాల గ్రామంలో 15వ ఆర్థిక సంఘం నిధులతో నిర్మిస్తున్న హెల్త్‌సబ్‌సెంటర్ల పనులకు బుధవారం ఆయన శంకుస్థాపన చేసి, మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో విద్యా, వైద్యరంగాలను పట్టించుకులేదన్నారు. రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించడంతో పాటు, నూతన ఉపాధ్యాయులను నియమించి బలోపేతం చేస్తోందన్నారు. ప్రతీ గ్రామంలో హెల్త్ సబ్‌సెంటర్లు నిర్మించి ప్రజలకు వైద్యసేవలు అందుబాటులో తీసుకొస్తున్న ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కిందన్నారు. కార్యక్రమంలో తుంగతుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నాగం జయసుధా, తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో సునీత, నాయకులు నాగం సుధాకర్‌రెడ్డి, దరిపెల్లి వీరన్న, ఎలిమినేటి కృష్ణప్రశాంత్, పసుల అశోక్‌యాదవ్, కట్ట మల్లారెడ్డి, సురికంటి చంద్రారెడ్డి, పాల్వాయి నాగరాజు, ఇరుగు కిరణ్ తదితరులు ఉన్నారు.

బీసీ రిజర్వేషన్ చట్టాన్ని 9వ షెడ్యూల్‌లో చేర్చాలి



మాట్లాడుతున్న రాజ్యాధికార జేఏసీ జిల్లా కన్వీనర్ విజయరామరాజు

సూర్యాపేట టౌన్,అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి):రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ చేసిన చట్టాన్ని 9వ షెడ్యూల్‌లో చేర్చాలని బీసీ, ఎస్సీఎస్టీ రైట్స్ అండ్ రాజ్యాధికార సాధన జేఏసీ జిల్లా కన్వీనర్ విజయరామ రాజు అన్నారు.బుధవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 78ఏళ్ల స్వాతంత్ర్య దేశంలో అధికభాగం ఉన్న బీసీలు అన్ని రంగాల్లో అణచివేతకు గురయ్యారని తెలిపారు. బీసీలకు రాజకీయ, ఆర్థిక, విద్య, ఉద్యోగ, వ్యాపారరంగాల్లో ఎక్కడా కూడా జనాభా నిష్పత్తికి సరిపడా ప్రా తినిధ్యం లేదన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించాలని ఈ నెల 24వ తేదీన ఇందిరాపార్క్‌లో జస్టిస్ ఈశ్వరయ్య, టీ చిరంజీవులు, డాక్టర్ విశారదన్‌మహరాజ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మహాధర్నాను విజయవంతం చేయాలన్నారు. మావాటా, మాఅధికారం మాకు కావాలనే లక్ష్యంతో బీసీలు ఉద్యమానికి సిద్ధం కావాలన్నారు. సమావేశంలో నాయకులు ఉపేందర్, వంశీ, సైదులు, భాస్కర్, రమేష్, నాగార్జున, అంబేడ్కర్, వినీత్ పాల్గొన్నారు.

ఉపాధి కూలీలు ఈకేవైసీ చేయించాలి

మఠంపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఉపాధిహామీ పథకంలో అర్హులైన కూలీలందరూ ఈకేవైసీ చేయించాలని ఏపీవో ఉమారాణి తెలిపారు. బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో ఈకేవైసీ ప్రక్రియను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని కూలీలనుద్దేశించి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కూలీల ఈకేవైసీ విధానంతో నేరుగా కూలీల ఖాతాలో నగదు జమచేసేందుకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు.

పథకంలో అవినీతి జరుగకుండా ఉండేందుకు ముఖగుర్తింపు యాప్‌లో నమోదు చేస్తున్నందున అర్హులైన ప్రతి కూలీ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జాబ్‌కార్డులను ప్రభుత్వం తొలగిస్తున్న నేపథ్యంలో ప్రతి కూలీ తమవంతు బాధ్యతగా యాప్‌లో తమ పేరు, ముఖ ఫొటోతో పాటు ఆధార్‌కార్డును అనుసంధానం చేయించుకోవాలన్నారు. సమావేశంలో ఈసీ సందీప్, టీఏలు బుంగయ్య, నర్సింహ, మల్సూర్, సక్యనాయక్, జీపీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు, ఉపాధిహామీ కూలీలు పాల్గొన్నారు.

ఆహ్లాదం.. అజిలాపురం బుగ్గజలపాతం

ఎత్తయిన కొండల నుంచి జాలువారుతున్న జలపాతం. వాటి మధ్య పరుచుకున్న ప్రకృతి పచ్చదనం, చల్లటి గాలులు, పక్షుల కిలకిల రావాలతో నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం అజిలాపురం బుగ్గజలపాతం పర్యాటకులను మైమరిపిస్తోంది. గ్రామశివారులోని 2500 ఎకరాల్లోని అడవిలో అడుగడుగునా ప్రకృతి రమణీయతే కనిపిస్తుంది.

(ఆంధ్రజ్యోతి-మర్రిగూడ)



జలధార వద్ద పర్యాటకులు

మర్రిగూడ మండలం అజిలాపురం గ్రామ శివారులో 2500 ఎకరాల్లో విస్తరించి ఉన్న అడవులు వానాకాలంలో పచ్చదనంతో ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. చుట్టూ ఉన్న కొండలపై నుంచి జాలువారే నీరు జలపాతాలను తలపిస్తున్నాయి. వర్షాలు బాగా కురిస్తే ఆరు నెలల పాటు ఈ జలపాతాలు కనులవిందు చేస్తుంటాయి. ఎగువ నుంచి వస్తున్న వర్షపు నీరు జలధారగా ఎత్తయిన కొండచరియల మీద నుంచి దూకుతూ కనువిందు చేస్తున్నాయి. ఈ మనోహర దృశ్యాలను చూసేందుకు వివిధప్రాంతాల నుంచి పర్యాటకులు నిత్యం ఇక్కడికి వస్తున్నారు. కుటుంబ సమేతంగా వచ్చి బుగ్గజలపాతంలో తడిసి ముద్దవుతున్నారు. ఇక్కడే వంటా వార్పు చేసుకుని ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆహ్లాదం మధ్య సేదతీరుతున్నారు.

రెండు కిలోమీటర్ల కాలినడక

దూరప్రాంతాల నుంచి బుగ్గజలపాతాన్ని చూసేందుకు వచ్చే పర్యాటకులకు అక్కడే కొలువుదీరిన బుగ్గ లక్ష్మీనరసింహస్వామి ఆలయం ఆధ్యాత్మిక చింతన పెంపొందిస్తోంది. దేవాలయం పక్కనే వాహనాలు నిలిపి బుగ్గ జలపాతాన్ని చూసేందుకు కాలిబాటలో రెండు కిలోమీటర్ల మేర కొండచరియల వెంట పచ్చనిచెట్ల మధ్య ప్రకృతిఅందాలను ఆస్వాదిస్తూ నడవడం పర్యాటకులకు సంతృప్తిని ఇస్తోంది.

పర్యాటక కేంద్రంగా గుర్తించాలి



బుగ్గజలపాతాన్ని రాష్ట్ర ప్రభుత్వం పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి. ఎత్తయిన కొండల మధ్య జారువారుతున్న నీటిప్రవాహాన్ని చూసేందుకు వచ్చే పర్యాటకులకు వసతులు లేక ఇబ్బంది పడుతున్నారు. ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దితే అభివృద్ధి చెందుతుంది.

చందునాయక్, సామాజిక కార్యకర్త



జాలువారుతున్న బుగ్గ జలపాతం

మరణించినా మరొకరిలో జీవిస్తూ..

● నార్కట్‌పల్లి యువకుడి బ్రెయిన్‌డెడ్ ● అవయవదానం చేసిన కుటుంబసభ్యులు



శ్రీహర్షయాదవ్ (ఫైల్ ఫొటో)

నార్కట్‌పల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లికి చెందిన యువకుడు బ్రెయిన్‌డెడ్ కాగా, కుటుంబ సభ్యులు అతడి అవయవాలు దానంచేసి ఆదర్శంగా నిలిచారు. భౌతికంగా లేకున్నా మరొకరి రూపంలో బతికే ఉంటాడని జీవన్‌దాన్ ట్రస్ట్ నిర్వాహకుల సూచనల మేరకు యువకుడి కుటుంబ సభ్యులు ఇందుకు అంగీకరించారు. నార్కట్‌పల్లికి చెందిన నడింపల్లి బలరాంసత్తయ్య, హేమలతల కుమారుడు శ్రీహర్షయాదవ్(21) రంగారెడ్డి జిల్లా బాటసింగారం సమీపంలోని బ్రిలియంట్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఈ నెల 18వ తేదీన కళాశాల ముగిసిన అనంతరం ఇంటికి బయలుదేరే క్రమంలో రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ వైపునకు వెళ్తున్న గుర్తుతెలియని కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర రక్తస్రావమైన శ్రీహర్షయాదవ్‌ను హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా, బ్రెయిన్‌డెడ్ అయ్యిందని వైద్యులు నిర్ధారించారు. నాలుగు రోజులపాటు వెంటిలేటర్‌పై ఉంచిన కుటుంబసభ్యులు, వైద్యుల సూచన మేరకు మంగళవారం తమ కుమారుడి అవయవాలను దానం చేసేందుకు అంగీకరించారు. శ్రీహర్ష గుండె, ఊపిరితిత్తులు, కాలేయం, కిడ్నీలను ఆయా ఆసుపత్రుల వారికి గ్రీన్‌ఛానల్ ద్వారా ప్రత్యేక అంబులెన్స్‌లో తరలించారు. అనంతరం గౌరవ సూచకంగా వందన సమర్పణ చేసి భౌతికకాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. బంధువులు, స్నేహితుల అశ్రునయనాల మధ్య శ్రీహర్ష యాదవ్ అంత్యక్రియలు బుధవారం నార్కట్‌పల్లిలో ముగిశాయి.

కొబ్బరికాయల ధరలకు రెక్కలు

● కార్తీకమాసం కావడంతో డిమాండ్

● రూ.35 నుంచి రూ.45 పలుకుతున్న ధరలు

● భక్తులకు తప్పని తిప్పలు



పూజల్లో వినియోగించే ప్రధానమైన కొబ్బరికాయల ధరలకు రెక్కలొచ్చాయి. అత్యంత ప్రీతికరమైన కార్తీకమాసంలో నిత్యం ఆరాధనలు, పూజలు కొనసాగుతాయి. ఆలయాలు, క్షేత్రాలను భక్తులు విరివిగా దర్శించుకుంటారు. ఈ సమయంలో కొబ్బరి కాయలకు డిమాండ్ మరింతగా ఉంటుంది. అయితే కొద్దికాలంగా వాటి ధరలు పెరిగిపోయాయి. గతంలో రూ.20లు పలికే కొబ్బరికాయ ధర ప్రస్తుతం రూ.35 నుంచి రూ.45 వరకు పలుకుతోంది.

(ఆంధ్రజ్యోతి-చింతపల్లి)

కార్తీకమాసంలో వేకువజామునే దేవతారాధన ప్రధానంగా ఉంటుంది. ఇంట్లో పూజలతో పాటు భక్తులు తరుచూ ఆలయాలను సందర్శిస్తుంటారు. ఆలయాలు, క్షేత్రాల్లో సైతం ఈ మాసాంతం ప్రత్యేక పూజా కార్యక్రమాలు కొనసాగుతుంటాయి. పూజల్లో ప్రధానంగా వినియోగించే కొబ్బరికాయల ధరలు రెండు నెలలుగా పెరుగుతూనే ఉన్నాయి. దీంతో సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కొబ్బరికాయలను పత్రం, పుష్పం, ఫలం తోయంగా భావిస్తుంటారు. దీంతో ఈ మాసంలో మంచి డిమాండ్ ఉంటుంది.

పూజలకు ప్రత్యేక మాసం

కార్తీకమాసం పూజలకు, దైవరాధనలకు ప్రత్యేకం. శివుడికి ఇష్టమైన మాసాల్లో కార్తీక మాసం ఒకటి. దీంతో ఈ మాసంలో ఉపవాసాలతో పాటు పూజలు చేస్తుంటారు. అదేవిధంగా అయ్యప్ప, ఆంజనేయస్వామి, శివభక్తుల మాలాధారణ చేస్తుంటారు. మండలం పాటు(40 రోజులు) చేపట్టే దీక్షను ఈ మాసంలోనే చాలామంది ప్రారంభిస్తారు. దీంతో ఎక్కడ చూసినా ఆధ్యాత్మిక వాతావరణం కనిపిస్తుంటుంది. డిసెంబరులో శబరిమలలో జరిగే ప్రత్యేక పూజలకు హాజరయ్యే భక్తులు ఈ మాసంలోనే మాలధారణ చేస్తుంటారు. దీంతో ఆలయాలు భక్తులతో కిక్కిరిస్తుంటాయి.

పెరిగిన డిమాండ్.. తగ్గిన దిగుబడి

ఉమ్మడి నల్లగొండ జిల్లాకు కొబ్బరికాయలు ఆంధ్రప్రదేశ్, కేరళ, తమిళనాడు రాష్ట్రాల నుంచి దిగుమతి అవుతుంటాయి. నల్లగొండ జిల్లా చింతపల్లి మండలానికి గతంలో వారానికి రెండు లారీల కొబ్బరికాయలు సరఫరా అవుతుండేవి. ప్రస్తుతం వారానికి ఒక లారీని మాత్రమే సరఫరా చేస్తున్నారని స్థానిక వ్యాపారులు తెలుపుతున్నారు. అయితే కొద్దికాలంగా పంట దిగుబడి లేకపోవడం, ప్రస్తుతం మార్కెట్‌లో డిమాండ్ ఉండటంతో కొబ్బరికాయల ధరలకు డిమాండ్ పెరిగింది. సరఫరా అయిన కొబ్బరికాయలు కూడా చిన్నవిగా ఉంటున్నాయని, కేవలం ఐదు రోజుల వరకు మాత్రమే నిల్వ ఉంటున్నాయని వ్యాపారులు పేర్కొంటున్నారు. గతంలో రూ.20లు పలికిన కొబ్బరికాయ ప్రస్తుతం రూ.35 నుంచి రూ.45 వరకు విక్రయిస్తున్నారు. ఇదిలా ఉండగా వ్యాపారులు సిండికేట్ కావడమే కారణమని పలువురు ఆరోపిస్తున్నారు.



ధరలు కొండెక్కాయి



నిత్యం మా ఇంట్లో పూజలు చేసి అనంతరం దేవాలయాలకు వెళ్తంటా. ఆలయానికి వెళ్లాలంటే పసుపు, కుంకుమ పువ్వులు, పండ్లు, కొబ్బరికాయతో వెళ్లి పూజలు చేస్తుంటా. నెల రోజుల క్రితం రూ.20 ఉన్న కొబ్బరికాయ ధర ప్రస్తుతం రూ.40కి చేరింది. గ్రామీణప్రాంతాల్లో రూ.40 నుంచి 45 వరకు విక్రయిస్తున్నారు. దిగుమతి చేసిన కొబ్బరికాయులు చిన్నవిగా ఉండటంతో వెంటనే కుళ్లిపోతున్నాయి.

కొండూరి శ్రీదేవి, మాజీ సర్పంచి (గొడకొండ్ల).

యువకుడి ఆత్మహత్య

రాజాపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా రాజాపేట మండలం కొండ్రెడిచెరువు గ్రామంలో యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామానికి చెందిన కర్రె కనుకయ్య వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నారు. ఆయనకు ఇద్దరు భార్యలు కాగా ముగ్గురు కుమారులు. మొదటి భార్యకు ఇద్దరు కుమారులు ఉండగా 13ఏళ్ల కిందట ఆమె మృతి చెందింది. మొదటి భార్య పెద్దకుమారుడు మహేష్(22) తండ్రికి వ్యవసాయంలో సాయంగా ఉంటున్నాడు. కనుకయ్య తల్లి పెంటమ్మ ఆరోగ్యం బాగా లేకపోవడంతో రెండు రోజుల కిందట ఆర్వీఎం ఆసుపత్రిలో చేర్పించారు. మంగళవారం తండ్రి, కుమారుడు కనుకయ్య, మహేష్‌లు ఇంటికి వచ్చారు. ఇంట్లో అందరూ నిద్రిస్తున్న సమయంలో గదిలో మహేష్ ఉరివేసుకున్నాడు. బుధవారం గది తలుపులు తెరిచి చూడగా ఆత్మహత్యకు పాల్పడినట్లు గుర్తించారు. మహేష్ మృతికి సంబంధించి ఎవరిపై అనుమానం లేదని తండ్రి కనుకయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అనిల్‌కుమార్ తెలిపారు.

ఎపిక్ ఫైల్స్‌ను డౌన్‌లోడ్ చేయొద్దు



సూర్యాపేట క్రైం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : సైబర్ మోసగాళ్లు వాట్సాప్ గ్రూపుల్లో నకిలీ ఎపిక్ ఫైల్స్‌ను పంపి మోసాలకు పాల్పడుతున్నారని, ఆ తరహా వాట్సాప్ మెసేజ్‌లను ప్రజలు డౌన్‌లోడ్ చేయవద్దని సూర్యాపేట జిల్లా ఎస్పీ కొత్తపల్లి నర్సింహ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సైబర్ నేరగాళ్లు ఎపిక్ ఫైల్స్‌ను ఆర్‌టీవో, టీఎస్ చలాన్ యాప్‌లు వంటి వాటిని విస్తృతంగా ప్రచారం చేస్తున్నారని తెలిపారు. వాటిని డౌన్‌లోడ్ చేయడం వల్ల సెల్‌ఫోన్లు హ్యాక్‌కు గురై సైబర్ మోసం జరుగుతోందన్నారు. ఎవరైనా ఈ ఫైల్స్‌ను క్లిక్ చేసి ఇన్‌స్టాల్ చేసినప్పుడు, హానికరమైన సాఫ్ట్‌వేర్ ద్వారా హ్యాక్‌కు గురై బాధితుడికి తెలియకుండా, అనుమతి లేకుండా మోసగాళ్లకు ఓటీపీ సందేశాలతో ఆటోమేటిక్ మెసేజ్ ఫార్వర్డ్‌ను అనుమతిస్తోందన్నారు. ఈ పద్ధతి ద్వారా సైబర్ నేరగాళ్లు బాధితుల బ్యాంకు ఖాతాల నుంచి మోసపూరితంగా డబ్బును దొంగిలిస్తున్నారని ప్రకటనలో వివరించారు. అందుకోసం నకిలీ ఆర్‌టీవో చలాన్ యాప్‌లు, పీఎం కిసాన్ ఏపీకేలు, ఎస్‌బీఐ యోనో, కస్టమర్ కేర్ యాప్‌లు సోషల్ మీడియాలో ప్రసారం అవుతున్న ఏమైనా ఇతర అనుమానాస్పద ఎపిక్ ఫైల్స్ వంటి వాటి వివరాలను వెంటనే పోలీసులకు తెలపాలన్నారు. ప్రజలు ఏవైనా మోసపూరిత యాప్స్‌ను గుర్తిస్తే వెంటనే సైబర్ హెల్ప్‌లైన్ నెంబర్ 1930కు ఫోన్ చేయాలన్నారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి



విద్యుదాఘాతంతో మృతి చెందిన ఆవు

రామన్నపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా రామన్నపేట మండల కేంద్రంలో విద్యుదాఘాతంతో ఆవు మృతి చెందింది. ఈ ఘటన బుధవారం జరిగింది. రామన్నపేటలోని బీసీ కాలనీకి చెందిన రైతు మోటె రాజుకు సొంత వ్యవసాయ భూమి ఉంది. వ్యవసాయ పశుపోషణ చేస్తూ రాజు జీవనం సాగిస్తున్నారు. బుధవారం ఉదయం ఆవును మేతకు వదలగా సమీపంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎర్త్‌వైర్ తగిలి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. రూ. 60వేల విలువైన ఎదకు వచ్చిన ఆవు మృతి చెందడంతో రైతు రాజు కన్నీటి పర్యంతమయ్యాడు.

కుక్కల దాడిలో ఆరు గొర్రెలు మృతి

ఆత్మకూరు(ఎస్), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా ఆత్మకూరు(ఎస్) మండలంలో కుక్కల దాడిలో గొర్రెలు మృతి చెందాయి. మండలంలోని బోట్యాతండా పంచాయతీ పరిధికి చెందిన భూక్యా టీక్యాకు చెందిన గొర్రెలపై మంగళవారం రాత్రి కుక్కలు దాడి చేశాయి. ఈ దాడిలో ఆరు గొర్రెలు మృతి చెందడంతో రూ.లక్ష నష్టం వాటిల్లినట్లు రైతు తెలిపాడు. మరికొన్ని గొర్రెలు గాయపడినట్లు తెలిపారు. టీక్యాను ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.

అప్పుపత్రాల కోసం మద్యం తాగించి వృద్ధురాలి హత్య



విలేకరుల సమావేశంలో కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ కొత్తపల్లి నర్సింహ

సూర్యాపేట క్రైం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలో ఈ నెల 14న వృద్ధురాలి హత్య కేసును హుజూర్‌నగర్ పోలీసులు ఛేదించారు. బంగారు ఆభరణాలు, అప్పుపత్రాల కోసం మద్యం తాపించి మత్తులోకి వెళ్లాక వృద్ధురాలిని హత్య చేసిన ముగ్గురిని రిమాండ్‌కు తరలించారు. కేసుకు సంబంధించిన వివరాలను జిల్లా ఎస్పీ కొత్తపల్లి నర్సింహ బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వెల్లడించారు. హుజూర్‌నగర్‌లోని ప్రభుత్వఆస్పత్రి వెనుక నివసిస్తున్న చెన్న అనసూర్యమ్మకు ఇద్దరు కుమారులు. ఓ కుమారుడు నకిరేకల్‌లో ఉంటుండగా, ఆమెతో పాటు ఉండే కుమారుడు వేణు వారణాసిలో వంటలు చేయడానికి వెళ్లాడు. అనసూర్యమ్మ ఇంట్లో ఒంటరిగా ఉంది. ఇదిలా ఉండగా ఇదే పట్టణంలోని యాదవుల బజారుకు చెందిన సుతారీ పని చేసే లింగం సతీష్‌కు ఆమె గతంలో రూ.50 వేలు ఇవ్వగా అతడు వడ్డీ చెల్లిస్తున్నాడు. ఈ నెల 14 రాత్రి సమయంలో సతీష్ అతడి మేనల్లుడు భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా భద్రాచలం ప్రాంతానికి చెందిన మైనర్‌తో అనసూర్యమ్మ ఇంటికి వెళ్లారు. ఆమెకు మద్యం ఇచ్చి, అది సేవించి మత్తులోకి వెళ్లాక ఇద్దరు కలిసి అనసూర్యమ్మ నోరు, ముక్కు మూసి హత్యచేశారు. అనంతరం ఆమె ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలు, ఇంట్లో భద్రపరిచిన సతీష్ రాసిఇచ్చిన రూ.50వేల తాలుకూ ప్రామిసరీ నోటును తీసుకుని వెళ్లిపోయారు. ఆ తర్వాత జరిగిన విషయాన్ని సతీష్ తన భార్య మౌనికకు తెలిపాడు. నిందితులు ముగ్గురు కలిసి చోరీచేసిన బంగారు ఆభరణాలను విజయవాడకు తీసుకెళ్లి అక్కడ కరిగించి బంగారు ముద్దలుగా మార్చుకుని భద్రపర్చుకున్నారు. ఈ నెల 15న ఉదయం అనసూర్యమ్మ నిద్రలేవకపోయేసరికి స్థానికులు ఇంట్లోకి వెళ్లి చూడగా మృతి చెంది ఉంది. దీంతో హుజూర్‌నగర్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని అనసూర్యమ్మ మృతికి కారణాలను తెలుసుకుని, ఘటనాస్థలంలో ఆధారాలను సేకరించారు. అనసూర్యమ్మ శరీరంపై గాయం ఉండడం, ఆమె ఒంటిపై బంగారు ఆభరణాలు లేకపోవడంతో హత్యగా నిర్ధారించుకున్నారు. దర్యాప్తులో భాగంగా సాంకేతిక ఆధారాల ప్రకారం లింగం సతీష్, అతడి భార్య మౌనిక, మేనల్లుడైన మైనర్ బాలుడిపై అనుమానంతో విచారించగా అనసూర్యమ్మను హత్య చేసింది తామేనని అంగీకరించారు. వారిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.3.60లక్షల విలువ చేసే బంగారు ముద్దలు, అప్పుకు సంబంధించిన ప్రామిసరీ నోటును స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. బాలుడిని కోర్టు అనుమతితో జువైనల్ హోంకు తరలిస్తున్నామని ఎస్పీ తెలిపారు. సమావేశంలో హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు, కానిస్టేబుళ్లు నాగరాజు, శంభయ్య ఉన్నారు.

వివాహేతర సంబంధం నెరుపుతుందనే హత్య

ఆత్మకూరు(ఎస్), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : కొరివి భిక్షమమ్మ వివాహేతర సంబంధం నెరుపుతుందన్న కారణంగానే హత్య చేసినట్లు సూర్యాపేట జిల్లా ఆత్మకూరు(ఎస్) ఎస్ఐ శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. ఈ విషయంలో ఇటీవల పంచాయితీ జరిగిందని, అయినప్పటికీ ఆమెలో మార్పు రాకపోవడంతో అవమానంగా భావించి పథకం ప్రకారం కారుతో ఢీకొట్టి కత్తితో గొంతుకోసి హత్య చేసినట్లు ఎస్ఐ తెలిపారు. భిక్షమమ్మ సోదరుడు గుండాల నర్సయ్య ఫిర్యాదుమేరకు భిక్షమమ్మ భర్త కొరివి మల్లయ్యతో పాటు చిన్నకుమారుడు ప్రవీణ్, అన్న కుమారుడు మహేష్, అతడి మిత్రులు వంశీ, జనార్ధన్‌లపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు. ఇదిలా ఉండగా బుధవారం సూర్యాపేట జిల్లా జనరల్ ఆసుపత్రిలో భిక్షమమ్మ మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఏపూరు గ్రామంలో ఆమె పెద్దకుమారుడు భరత్ అంత్యక్రియలు నిర్వహించారు.

షార్ట్‌సర్క్యూట్‌తో సెలూన్ దుకాణం దగ్ధం



దగ్ధమైన సెలూన్‌ను పరిశీలిస్తున్న నాయకులు

ఆలేరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో హెయిర్‌కటింగ్(సెలూన్) దుకాణం దగ్ధమైంది. ఈ సంఘటన యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణంలో మంగళవారం రాత్రి జరిగింది. సీఐ యాలాద్రి, దుకాణ యజమాని బొప్పాపురం కృష్ణయ్య తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.మండలంలోని గుండ్లగూడెం గ్రామానికి చెందిన కృష్ణయ్య ఆలేరులోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో అద్దె గదిలో సెలూన్ నిర్వహిస్తున్నాడు. మంగళవారం దుకాణానికి సెలవు ఉండడంతో తెరవలేదు. రాత్రి సమయంలో దుకాణం లోపల నుంచి పొగలు రావడాన్ని గమనించిన స్థానికులు కృష్ణయ్యకు, ఫైర్‌స్టేషన్‌కు సమాచారమిచ్చారు. ఫైరింజన్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను చల్లార్చారు. అప్పటికే కుర్చీలు, సోఫాలు, హెయిర్‌కటింగ్ సామాగ్రి కాలిబూడిదయ్యాయి. ఘటనా స్థలాన్ని కాంగ్రెస్ అధ్యక్షుడు ఎజాజ్ బుధవారం సందర్శించి, కృష్ణయ్యను పరామర్శించారు. విషయాన్ని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్యకు ఫోన్‌లో వివరించారు. ప్రభుత్వం నుంచి పరిహారానికి కృషి చేస్తానని తెలిపారు. కృష్ణయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ యాలాద్రి తెలిపారు.

సరిహద్దులోని ఆర్టీఏ చెక్‌పోస్టుల మూసివేత

● ఉమ్మడి నల్లగొండలో మూడు చోట్ల చెక్‌పోస్టులు

● రాష్ట్ర రవాణా శాఖ ఆదేశాల మేరకే నంటూ ఫ్లెక్సీల ఏర్పాటు



నాగార్జునసాగర్‌లో చెక్‌పోస్టును ఎత్తివేస్తున్నట్లు ఏర్పాటుచేసిన ఫ్లెక్సీ, నల్లగొండకు తరలిస్తున్న సామాగ్రి

కోదాడ రూరల్ / నాగార్జునసాగర్ / దామరచర్ల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర సరిహద్దుల్లో ఉన్న ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని ఆర్టీఏ చెక్‌పోస్టులను బుధవారం నుంచి మూసివేశారు. తెలంగాణ రాష్ట్ర సరిహద్దుల్లోని 15 చెక్‌పోస్టులను మూసివేయాలని రాష్ట్ర రవాణా శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఆ మేరకు బుధవారం సాయంత్రం ఐదు గంటలకు నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ హిల్‌కాలనీ వద్ద ఉన్న ఆర్టీఏ చెక్‌పోస్టును మూసివేసి ఇక్కడ ఉన్న కార్యాలయ సామాగ్రిని ఆటోలో నల్లగొండ ఆర్టీఏ కార్యాలయానికి తరలించారు. చెక్‌పోస్టును మూసివేస్తున్నట్లు ఓ ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. ఇక నుంచి ఇతరరాష్ట్రాల నుంచి తెలంగాణకు వచ్చే ట్రాన్స్‌పోర్ట్ వాహనాల చలాన్లు ఆన్‌లైన్ ద్వారా చెల్లించాలని ప్రకటనలో పేర్కొన్నారు. అదేవిధంగా దామరచర్ల మండలం వద్ద ఉన్న చెక్‌పోస్టును మూసివేసి ఫర్నీచర్‌ను, సామాగ్రిని జిల్లా కార్యాలయానికి తరలించారు. ప్రస్తుతం రవాణాలావాదేవీలను పూర్తిస్థాయిలో ఆన్‌లైన్ ద్వారా నిర్వహిస్తున్న నేపథ్యంలో చెక్‌పోస్టును మూసివేస్తున్నట్లు అసిస్టెంట్ ఎంవీఐ సతీష్ తెలిపారు. సూర్యాపేట జిల్లా కోదాడ మండలం నల్లబండగూడెం వద్ద అంతర్రాష్ట్ర ఆర్టీఏ చెక్‌పోస్టునూ మూసివేశారు. ఇక్కడి సామాగ్రిని, రికార్డులు, ఫర్నీచర్, కంప్యూటర్లను నల్లగొండ ఆర్టీఏ కార్యాలయానికి తరలిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా తెలంగాణరాష్ట్రం ఏర్పాటైన ఏడాదిన్నర తర్వాత అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులను అప్పటి ప్రభుత్వం ఏర్పాటుచేసింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంతో పాటు ఇతరరాష్ట్రాలకు చెందిన వాహనాలు తెలంగాణలోకి రావాలంటే ట్యాక్స్ చెల్లించాల్సి ఉంటుంది. అయితే ఇక్కడ చెల్లించే ట్యాక్స్‌లను ప్రభుత్వం ఆన్‌లైన్‌లోనూ చెల్లించే విధానం తీసుకువచ్చింది. దీంతో చెక్‌పోస్టులను ఎత్తివేత తప్పలేదని అధికారులు తెలిపారు.

విడి సిమెంట్ విక్రయిస్తున్న వ్యాపారిపై కేసు

చిట్యాల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ట్యాంకర్ల నుంచి సిమెంట్ కొనుగోలు చేసి అధిక ధరకు విక్రయిస్తున్న వ్యాపారిపై కేసు నమోదు చేసినట్లు నల్లగొండ జిల్లా చిట్యాల ఎస్ఐ మామిడి రవికుమార్ తెలిపారు. ఆయన తెలిపిన ప్రకారం చిట్యాల భువనగిరి రోడ్డులో విడి(బస్తాల్లో కాకుండా) సిమెంట్ వ్యాపారం చేస్తున్నారన్న సమాచారం మేరకు మంగళవారం రాత్రి ఎస్ఐ తన సిబ్బందితో అక్కడికి వెళ్లి పరిశీలించారు. సిమెంట్ బ్రిక్స్ వ్యాపారి గుండాల శ్రీనును అదుపులోకి తీసుకుని విచారించారు. అక్కడే షెడ్‌లో ఉన్న 83బస్తాల లూజ్ సిమెంట్ బ్యాగులను శ్రీను నిల్వ చేసినట్లు గుర్తించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో పలువురికి జైలు శిక్ష, జరిమానా

సూర్యాపేట క్రైం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ పట్టుబడిన పలువురికి కోర్టులో జైలు శిక్ష, జరిమానా విధించినట్లు సూర్యాపేట జిల్లా కేంద్ర ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21న సూర్యాపేటలోని పలు ప్రాంతాల్లో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టగా మోతాదుకు మించి మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ఐదుగురు పట్టుబడినట్లు తెలిపారు. వారిని బుధవారం సూర్యాపేట ద్వితీయ శ్రేణి కోర్టులో హాజరుపర్చగా నాయమూర్తి పీవీ రమణ ఒకరికి రెండు రోజుల జైలుశిక్ష, రూ.2 వేల జరిమానా విధించారు. అదేవిధంగా మిగిలిన నలుగురికి కలిపి రూ.4 వేల జరిమానా విధించారని తెలిపారు. మద్యం మత్తులో వాహనాలు నడపవద్దని, ప్రమాదాలకు దారితీస్తాయన్నారు.

రూ.1.22 కోట్లతో పర్వతరావు చెరువు పునరుద్ధరణ

హైదరాబాద్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా దేవరకొండ మండలంలోని పర్వతరావు చెరువు పునరుద్ధరణ పనుల కోసం రూ.1.22 కోట్లతో పనులు చేపట్టేందుకు ప్రభుత్వం పరిపాలనపరమైన అనుమతినిచ్చింది. ఈ మేరకు బుధవారం నీటిపారుదలశాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా జీవో జారీ చేశారు.

బాలాజీనాయక్ ఏజెంట్లలో మొదలైన అలజడి

● ప్రత్యక్షచర్యలకు దిగుతున్న బాధితులు

● బాలాజీనాయక్ కంటే మధునాయక్‌పైనే ఫిర్యాదులు ఎక్కువ

పెద్దఅడిశర్లపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): అధికవడ్డీకి ఆశపడి కోట్ల రూపాయలను కొల్లగొట్టిన నల్లగొండ జిల్లా పీఏపల్లి మండలానికి చెందిన రమావత్ బాలాజీనాయక్, మధునాయక్ ఉదంతంలో ఏజెంట్లలో అలజడి మొదలైంది. వడ్డీ విషయం బయటకు చెప్పవద్దని, చెబితే డబ్బులు రావని ద్వితీయశ్రేణి ఏజెంట్లు బాధితులను బెదిరించేవారు. దీంతో బాధితులు వెనుకడుగు వేశారు.ఇటీవల బాలాజీనాయక్‌తో పాటు మధునాయక్‌ను పోలీసులు రిమాండ్‌కు తరలించడంతో బాధితులు ఒక్కొక్కరూ గుడిపల్లి పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించగా మరికొందరు ప్రత్యక్ష చర్యలకు దిగుతున్నారు. ఏజెంట్ల ఇళ్ల వద్దకు, ఆస్తులు ఎక్కడ ఉన్నాయో ఆరా తీసి వాటిని స్వాధీనం చేసుకునే ప్రయత్నం చేస్తున్నారు. దీంతో ఏజెంట్లలో అలజడి మొదలైంది. ఇన్నిరోజులు బాలాజీనాయక్, మధునాయక్‌ను నమ్ముకుని ఉన్న ఏజెంట్లు ఇప్పుడు మొహం చాటేస్తున్నారు. అంతేకాకుండా బాలాజీ నాయక్, మధునాయక్ దగ్గర తర్ఫీదు పొందిన ఏజెంట్లు వారి కంటే అధిక వడ్డీలు ఇస్తామని జనాలను మోసం చేసినట్లు తెలుస్తోంది. అమాయక ప్రజల వద్ద డబ్బులు తీసుకున్న ఏజెంట్లను పోలీసులు అదుపులోకి తీసుకుంటే ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్రజల నుంచి ఎన్ని కోట్లు తీసుకున్నారో తెలుస్తుందని బాధితులు వేడుకుంటున్నారు. బాధితులకు ప్రామిసరీ నోట్లపై అవగాహన లేకపోవడంతో ఏజెంట్లకు వరంలా మారింది. బాధితులకు ఎన్ని రూ.కోట్లు అయినా ఒక్క ప్రామిసరీ నోట్‌పైనే రాసి ఇచ్చారు.

వీటి ఆధారంగా న్యాయం చేయడం పోలీసులకు సవాల్ మారింది. ఇదిలా ఉండగా రోజురోజుకు గుడిపల్లి పోలీస్‌స్టేషన్‌కు నల్లగొండ జిల్లా నలుమూలల నుంచి ఏజెంట్లపై ఫిర్యాదులు అందుతున్నా ఎన్ని ఫిర్యాదులు వచ్చాయనే విషయాన్ని పోలీసులు గోప్యంగా ఉంచుతున్నారు.

ఫిట్‌నెస్ మంత్రం.. ఆరోగ్యం పదిలం

» ఉరుకుల, పరుగుల జీవితంలో ఆరోగ్యంపై అశ్రద్ధ » ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు చెమటోడుస్తున్న వైనం
» ఐదు పదుల వయస్సులో ఉత్సాహంగా కసరత్తు » యువతకు ఆదర్శంగా నిలుస్తున్న సూర్యాపేట వాసులు

ఆరోగ్యానికి ఫిట్‌నెస్ ఎంతో ముఖ్యం. ఇది శారీరక, మానసిక ఆరోగ్యానికి ఉపయోగపడుతుంది. గతంలో ఐదు పదుల వయస్సు దాటితేనే ఆరోగ్య సమస్యలు వచ్చేవనుకునే వారు. కానీ ప్రస్తుత ఉరుకుల, పరుగుల జీవితంలో క్షణం తీరిక లేకుండా గడుపుతున్నారు. ఆరోగ్యంపై అశ్రద్ధ వహిస్తే ముప్పు వచ్చే ప్రమాదముంది. ప్రస్తుతం ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ముఖ్యం. ప్రతిరోజూ వ్యాయామం చేస్తూ ఆరోగ్యకర జీవితాన్ని ఆస్వాదించాలి.

- ఆంధ్రజ్యోతి, సూర్యాపేటటౌన్



ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు అనేకమంది ప్రతిరోజూ వ్యాయామం, జిమ్ సెంటర్లలో కసరత్తు చేస్తున్నారు. ఐదు పదులు వయస్సు దాటిన వారు జిమ్ సెంటర్‌లో కసరత్తు చేస్తూ శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుకుంటున్నారు. జిమ్‌లో గంటకు పైగా వ్యాయామం చేస్తూ దేహదారుఢ్యంతో పాటు ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నారు. ఉదయం నిద్రలేచింది మొదలు గంట నుంచి గంటన్నర వరకు జిమ్‌లోనే కసరత్తు చేస్తున్నారు. సూర్యాపేట జిల్లాకేంద్రంలోని పబ్లిక్‌క్లబ్ వ్యాయామశాలలో ఐదు పదులు దాటిన సుమారు 60 మంది ఆరోగ్యం కోసం చెమటోడుస్తున్నారు. యువత జిమ్‌కు కూడా జిమ్‌లకు వచ్చేలా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచిస్తున్నారు.

పబ్లిక్ క్లబ్‌లో కసరత్తులు

సూర్యాపేట జిల్లాకేంద్రంలోని పబ్లిక్‌క్లబ్‌లో మూడు సంవత్సరాల క్రితం వ్యాయామశాలను ప్రారంభించారు. ఉదయం 5గంటల నుంచి 9గంటల వరకు, తిరిగి సాయత్రం 5గంటల నుంచి రాత్రి 9గంటల వరకు సుమారు 60మంది 50 సంవత్సరాలకు పైబడిన వారు కసరత్తు చేస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నారు. వీరిలో 50 నుంచి 65 ఏళ్ల వయస్సు వారు ఉన్నారు. శరీరాకృతిని, బరువును తగ్గించుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నారు. వ్యాయామం వీరి దినచర్యలో భాగమైంది.

వ్యాయామశాలను మరింతగా అందుబాటులోకి తీసుకొస్తాం



పబ్లిక్‌క్లబ్ వ్యాయామశాలలో మరిన్ని సౌకర్యాలు కల్పిస్తాం. ఇక్కడ షటిల్‌కోర్టుకు సైతం మంచి ఆదరణ ఉంది. పబ్లిక్‌క్లబ్ సేవలు ఉపయోగించుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ఆనందంగా ఉంది. నేటి యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి.

- కొప్పుల వేణారెడ్డి, పబ్లిక్‌క్లబ్ సెక్రెటరీ

వ్యాయామంతో ఆరోగ్యం పదిలం



జిల్లాకేంద్రంలోని పబ్లిక్‌క్లబ్ వ్యాయామశాలలో సౌకర్యాలు బాగున్నాయి. వ్యాయామంతో ఆరోగ్యం పదిలంగా ఉంటుంది. ప్రతి ఒక్కరూ అరగంటకు పైగా వ్యాయామం చేస్తే మంచింది. వ్యాయామశాలను ఉపయోగించుకుంటున్నాను.

- డాక్టర్ మురళిమోహన్, సూర్యాపేట

ఉదయం, సాయంత్రం కసరత్తు



ఉదయం, సాయంత్రం వ్యాయామశాలలోనే ఉంటున్నాను. ప్రస్తుతం ఎలాంటి ఆరోగ్య సమస్యలు లేవు. పబ్లిక్‌క్లబ్ ఆధ్వర్యంలో నడుస్తున్న వ్యాయామశాలలో సౌకర్యాలు బాగానే ఉన్నాయి. జిమ్‌లో కావాల్సిన శిక్షణను వివరిస్తున్నారు.

- భీష్మారెడ్డి, సూర్యాపేట

వయస్సుతో సంబంధం లేకుండా వ్యాయామం



అనారోగ్య సమస్యలకు చెక్‌పెట్టేలా జిమ్ ఉపయోగపడుతుంది. పబ్లిక్‌క్లబ్‌లో వ్యాయామశాల ఏర్పాటు చేసినప్పటి నుంచీ ఇక్కడికి వస్తున్నాను. మంచి వాతావరణం ఉంది.

- వెంకట్‌రెడ్డి, సూర్యాపేట

ధృడమైన శరీరం జిమ్‌తో సాధ్యం



జిమ్‌లో కసరత్తులతో ధృడమైన శరీరం ఏర్పడుతుంది. ప్రతిరోజు క్రమం తప్పకుండా వ్యాయామంతో శరీరం అందమైన ఆకృతిలో వస్తుంది. ఇటీవల పలు పోటీల్లో పాల్గొన్నాను. యువత జిమ్‌కు వచ్చేలా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి

- రామూర్తి, సూర్యాపేట

జిమ్ సెంటర్‌ను ఉపయోగించుకోవాలి



యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి. వ్యాయామంతో డ్రగ్స్‌ను దూరం చేసుకునే అవకాశం ఉంది. డ్రగ్స్‌తో అనార్యోగానికి గురికావాల్సిందే. సుమారు 60మందికి శిక్షణ ఇవ్వడం ఆనందంగా ఉంది.

- ప్రసాద్, శిక్షకుడు, సూర్యాపేట.

శివలింగాన్ని తాకిన సూర్యకిరణాలు



శివలింగంపై ప్రకాశిస్తున్న సూర్యకిరణాలు

హుజూర్‌నగర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండల పరిధిలోని బూరుగడ్డ నల్లకట్ట సంతానకామేశ్వరి సమేత శంభులింగేశ్వరస్వామి దేవాలయంలో బుధవారం శివలింగాకారాన్ని సూర్యకిరణాలు తాకాయి. ఉదయం 6గంటల సమయంలో సూర్యకిరణాలు పడగా సుమారు 10 నిమిషాలపాటు శివలింగంపై కిరణాలు ప్రకాశించాయి. కాకతీయుల కాలంలో నిర్మించిన ఈ శివాలయాన్ని 12 సంవత్సరాల క్రితం పునర్ నిర్మించారు. ఆనాటి నుంచి ప్రతి ఏటా కార్తీకమాసం 30 రోజులు సూర్యకిరణాలు శివలింగాన్ని తాకుతుండడం గమనార్హం. ఎంతో చారిత్రాత్మక మహత్యం కలిగిన బూరుగడ్డ శివాలయంలో సూర్యకిరణాలు పడుతున్న సమయంలో రుద్రాభిషేకం చేస్తున్నట్లు అర్చకులు గుంటిపల్లి రవీంద్రాచార్యులు తెలిపారు. ఎంతో ప్రాచుర్యం కలిగిన బూరుగడ్డ శివాలయంలో కార్తీకమాసంలో భక్తులు ప్రత్యేక పూజలు చేస్తున్నారు.

ఎంజీయూలో ప్లేస్‌మెంట్ డ్రైవ్‌కు స్పందన

నల్లగొండ టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం ప్లేస్మెంట్ సెల్ ఆధ్వర్యంలో ఫ్రాంక్లిన్ టెక్ లిమిటెడ్ హైదరాబాద్ సంస్థ సహకారంతో బుధవారం నిర్వహించిప ప్లేస్‌మెంట్ డ్రైవ్‌కు విశేష స్పందన లభించింది. మొత్తం 220 మంది అభ్యర్థులు హాజరుకాగా 70 మందిని జాబితాలో చేర్చినట్లు ప్లేస్‌మెంట్ సెల్ డైరెక్టర్ వై. ప్రశాంతి తెలిపారు. ఐటీ, నాన్ ఐటీ రంగాల్లో ఉద్యోగ నియామకాల కోసం జరిగిన కార్యక్రమంలో జిల్లాతో పాటు ఇతర జిల్లాల నుంచి అభ్యర్థులు పెద్దసంఖ్యలో హాజరైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్లు శేఖర్, సత్యనారాయణరెడ్డి, వెంకట్, ఫ్రాంక్లిన్ టెక్ సీఈవో ఆర్. శివకుమార్, కంపెనీ హెచ్‌ఆర్ ప్రతినిధులు వేణు, ప్రతాప్, దివ్య, పృధ్వి, శ్రీకాంత్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

నిలకడగా మూసీకి ఇన్‌ఫ్లో

కేతేపల్లి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మూసీ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో నిలకడగా కొనసాగుతోంది. హైదరాబాద్ నగరంతో పాటు ఎగువ మూసీ పరివాహక ప్రాంతాల్లో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో ప్రాజెక్టులోకి వచ్చే ఇన్‌ఫ్లో రెండు రోజులుగా సాధారణ స్థితిలో ఉంది. దీంతో ప్రాజెక్టు అధికారులు 15 రోజులకు పైగా ఎత్తి ఉంచిన ఒక్కో క్రస్టుగేటును క్రమంగా మూసి వేస్తూ నీటిమట్టాన్ని 645అడుగుల గరిష్ట స్థాయికి చేర్చుతున్నారు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రానికి 1767.22 క్యూసెక్కులుగా ఉన్న ఇన్‌ఫ్లో బుధవారం సాయంత్రానికి స్వల్పంగా తగ్గి 1517.58 క్యూసెక్కులుగా నమోదైంది. ప్రాజెక్టు నీటిమట్టం గరిష్ట స్థాయి నుంచి తగ్గకుండా ఉంచుతున్న అధికారులు ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లోను ప్రాజెక్టు 8నెంబరు క్రస్టుగేట్లను రెండు అడుగుల మేర ఎత్తి 1323.02 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.


జాతీయ సాఫ్ట్ బేస్‌బాల్ పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

చౌటుప్పల్ టౌన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలోని ట్రినిటీ విద్యాసంస్థలకు చెందిన నలుగురు విద్యార్థులు సాఫ్ట్ బేస్‌బాల్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 19వ తేదీన జగిత్యాల జిల్లా కోరుట్లలో జరిగిన రాష్ట్రస్థాయి నాలుగో సాఫ్ట్ బేస్ బాల్ సబ్ జూనియర్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు పి. నిషాంత్, కే. మనోజ్‌కుమార్, కే. వైష్ణవి, జి. అక్షర ప్రతిభను కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వచ్చే నెల 7, 8, 9వ తేదీల్లో మహారాష్ట్రలోని షిరీడిలో నిర్వహించే జాతీయ స్థాయిలో పోటీల్లో పాల్గొంటారు. జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను ట్రినిటీ విద్యాసంస్థల చైర్మన్ కృష్ణారావు, ప్రిన్సిపాల్ మంజుల తదితరులు అభినందించారు.

జాతీయస్థాయి ఎయిర్ పిస్టల్ పోటీలకు



పవన్‌కుమార్

భూదాన్‌పోచంపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కేరళ రాష్ట్ర రాజధాని త్రివేండ్రంలో అక్టోబరు 11 నుంచి 14 వరకు జరిగిన 16వ సౌత్‌జోన్ 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ పోటీల్లో తెలంగాణ రాష్ట్ర తరుపున యాదాద్రి-భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలం పెద్దరావులపల్లి గ్రామానికి చెందిన తప్పెట పవన్‌కుమార్ పోటీల్లో పాల్గొన్నాడు. ఈ పోటీల్లోని యూత్ సబ్ యూత్ విభాగంలో ఆయన జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు కోచ్ సందీప్‌కుమార్ తెలిపారు. పవన్ ఎంపిక పట్ల పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు అభినందించారు.

రాష్ట్రస్థాయి జూడో పోటీలకు విద్యార్థిని



కనుకునిది చందన

గుండాల, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇటీవల నిర్వహించిన ఉమ్మడి నల్లగొండ జిల్లా స్కూల్ గేమ్స్ అండర్ -14,17 బాలబాలికల పోటీల్లో గుండాల కస్తూర్బా పాఠశాలకు చెందిన కనుకునిది చందన రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. విద్యార్థినిని పాఠశాల స్పెషల్ ఆఫీసర్ విజయలక్ష్మీ, ఉపాధ్యాయులు అభినందించారు. రాష్ట్రస్థాయి క్రీడల్లో రాణించాలని వారు ఆకాంక్షించారు.

భక్తిశ్రద్ధలతో యాద'గిరి' ప్రదక్షిణ

● భక్తుల భజనలు, కీర్తనలు
● నరసింహ నామంతో ప్రతిధ్వనించిన దివ్యక్షేత్రం



గిరిప్రదక్షిణలో పాల్గొన్న కలెక్టర్ హనుమంతరావు, విప్ అయిలయ్య దంపతులు

యాదగిరిగుట్ట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి దివ్య క్షేత్రం నమో నారసింహ కీర్తనలతో ప్రతిధ్వనించింది. బుధవారం స్వాతి నక్షత్రం పురస్కరించుకొని ఆలయంలో వేకువజామున అష్టోత్తర శతఘటాభిషేకం, గిరిప్రదక్షిణ, కార్తీక వ్రతాలు జరిపించి దీపాలను వెలిగించారు. వైకుంఠద్వారం నుంచి సామూహిక గిరిప్రదక్షిణ వైభవంగా కొనసాగింది. ఈ వేడుకలతో ఆధ్యాత్మిక శోభ రెట్టింపైంది. ఆలయంలో వేకువజాము నుంచి రాత్రి వరకు వివిధ పూజల్లో పాల్గొనేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చారు. స్వామివారి జన్మనక్షత్రం సందర్భంగా అష్టోత్తర శతఘటాభిషేక పూజలు అర్చకులు చేపట్టారు. గిరిప్రదక్షిణలో స్వామివారిని స్తుతిస్తూ భజనలు, కీర్తనలతో కొండచుట్టు రెండున్నర కిలోమీటర్ల మేర 45 నిమిషాల పాటు హోరెత్తించారు. గిరిప్రదక్షిణ పూర్తి చేసిన భక్తులు మెట్ల దారిలో కొండెక్కె. భక్తులకు 1,500 ఉచిత దర్శన టికెట్లు మాత్రమే అధికారులు పంపిణీ చేసి, ప్రత్యేక దర్శన క్యూలైన్ ద్వారా ఆలయంలోకి అనుమతించారు. అధిక సంఖ్యలో వాహనాలపై తరలి రావడంతో వైకుంఠద్వారం (కూడలి) రోడ్లు నిండిపోగా వాహనాల పార్కింగ్‌తో ప్రదక్షిణ భక్తుల రాకపోకలకు అంతరాయం కలిగింది. ప్రదక్షిణ మధ్యాహ్నం ఆరగింపు సమయం (12గంటలకు) వరకు సుమారు 25వేల మంది భక్తులు ప్రదక్షిణ పూర్తి చేసుకున్నారు. ఉభయ క్యూలైన్‌లో భక్తులు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భక్తుల రద్దీ కొనసాగగా బ్రేక్ దర్శనాలు, మధ్యాహ్నం ఆరగింపు సమయం కలిపి మూడు గంటల పాటు వేచి ఉన్నారు. కొండకింద కల్యాణ కట్టలో తలనీలాలు సమర్పించి కొంతమంది భక్తులు కొండపైన విష్ణు పుష్కరిణి, లక్ష్మీపుష్కరిణిలో పుణ్య స్నానాలు, సత్యదేవుని వ్రతాలు ఆచరించి మొక్కులు తీర్చుకోగా, దర్శనానంతరం అన్నప్రసాదం స్వీకరించారు.



గిరిప్రదక్షిణ సమయంలో నడుస్తున్న వాహనాలు

వేదాశీర్వచనం

ఆలయంలోకి ప్రవేశించిన ప్రభుత్వ విప్ అయిలయ్య దంపతులు, కలెక్టర్ హనుమంతరావు కు ఆలయ మర్యాదలతో ప్రధానార్చకుడు భట్టర్ సురేంద్రాచార్యులు బృందం స్వాగతం పలికారు. గర్భాలయంలోని స్వయంభువులను దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. వేద మండపంలో పండితులు వేదాశీర్వచనం చేశారు. కాగా, ప్రతి నెల స్వాతి నక్షత్రం రోజున వైకుంఠద్వారం చెంత శ్రీ వెంకట అన్నమాచార్య సేవ ట్రస్టు కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. యాదగిరిగుట్ట ఏసీపీ పి. శ్రీనివాస్‌నాయుడు పర్యవేక్షణలో పట్టణ ఇన్స్‌పెక్టర్ బొడ్డుపల్లి భాస్కర్ సారథ్యంలో భక్తుల రద్దీని అదుపు చేసేందుకు పోలీసులు బారికేడ్లతో బందోబస్తు నిర్వహించారు.

అష్టోత్తర శతఘటాభిషేక పూజలు

ఆలయంలో స్వామివారి స్వాతి జన్మ నక్షత్రం పురస్కరించుకొని వేకువజామున అష్టోత్తర శతఘటాభిషేకం పూజారులు వైభవంగా నిర్వహించారు. సుప్రభాత సేవతో స్వామిఅమ్మవారిని మేల్కొలిపి నిత్యారాధనలు జరిపిన అర్చకులు ఆస్థాన పరంగా ఆరాధనలు జరిపి ఉత్సవమూర్తులకు హారతి నివేదించారు. ముఖమండపంలో 108 కలశాలు ఏర్పరచి వాటిపై కొబ్బరికాయలు పేర్చి అందులో పంచామృతాలు నింపి పంచసూక్త పఠనాలతో హవనం చేపట్టారు. ఉత్సవమూర్తులను, ఆలంకార మూర్తులను అభిషేకించారు. తులసీ దళాలతో సహస్రనామార్చనలు నిర్వహించారు. పండితుల వేద మంత్రాలు, ఆస్థాన విద్వాంసుల మంగళవాయిద్యాల నడుమ అష్టోత్తర శతఘటాభిషేకం నిర్వహించి 108 సువర్ణ పుష్పాలతో అర్చించారు. సాయంత్రం స్వామివారి జన్మనక్షత్రం సందర్భంగా దివ్యమనోహరంగా అ లంకరించి ప్రత్యేక పూజలు చేశారు. కాగా యాద గిరిక్షేత్రంలో హరిహరులకు నిత్యపూజలు శాస్త్రో క్తంగా కొనసాగాయి. ఆలయ ఖజానాకు వివిధ వి భాగాల ద్వారా రూ.20,79,254 ఆదాయం సమకూరినట్లు ఇన్‌చార్జి ఈవో గుగులోతు రవి తెలిపారు.



అష్టోత్తర పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

కార్తీక దీపారాధన

కాగా, వ్రత మండపాలు, పరిసర ప్రాంతాలను ఆలయ అధికారులు పరిశీలిస్తూ సిబ్బందికి తగిన సూచనలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్తీక మాసం సందర్భంగా ఇష్టదైవాలను దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో కార్తీక దీపాలు వెలిగించారు. కొండపైన ఆలయం ఉత్తర రాజగోపురం ఎదుట, శివాలయం, విష్ణుపుష్కరిణీ, కొండకింద లక్ష్మీపుష్కరిణి, వ్రత మండపం, వైకుంఠద్వారంతో కలిపి ఐదు ప్రదేశాల్లో టెండరుదారులు తగిన ఏర్పాటు చేయగా భక్తులు కార్తీక దీపాలను వెలిగించి భక్తిని చాటుకున్నారు.

ఆరు విడతల్లో 175 వ్రతాలు

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారి ఆలయంలో బుధవారం భక్తులు అధిక సంఖ్యలో సత్యదేవుని కార్తీక వ్రతాలు నిర్వహించారు. కార్తీక మాసం ప్రవేశంతో రాష్ట్ర నలూమూలల నుంచి తరలివచ్చిన భక్తులతో కొండకింద వ్రత మండపాలు నిండిపోగా కొండపైన ఇష్టదైవాలను దర్శించుకుని ఆర్జిత సేవల్లో పాల్గొన్నారు. తొలిరోజు ఆరు విడతల్లో జరిగిన వ్రతాల్లో 175 జంటలు సత్యదేవుని వ్రతాలు ఆచరించి మొక్కులు తీర్చుకున్నాయి. మొదటి విడత 36, రెండో విడత 67, మూడో విడత 33, నాలుగో విడత 23, ఐదో విడత 08, ఆరో విడత 08 వ్రతాలు జరిగినట్లు ఏఈవో జాటోతు శంకర్‌నాయక్ తెలిపారు. రూ.1,000 టికెట్టు పొందిన దంపతులకు వ్రత పూజ సామగ్రి, అవసరమయ్యే పాత్రలు అధికారులు అందజేశారు. కాగా, భక్తుల సౌకర్యార్థం కియోస్కో యంత్రాలు, మొబైల్ ఏటీఎం అధికారులు ఏర్పాటు చేశారు.



వ్రత పూజల్లో పాల్గొన్న భక్తులు

రోడ్డు దాటాలంటే ప్రయాసే..



రోడ్డుకు ఇరువైపులా నిలిపి ఉంచిన వాహనాలు

మిర్యాలగూడ టౌన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని రెడ్డీకాలనీలో ఆస్పత్రులు, విద్యాలయాలతో పాటు వ్యాపార సంస్థలు చాలా ఉన్నాయి. వాటిని నిర్వహించే యజమానులు కనీస నిబంధనలు పాటించడం లేదు. రహదారులను ఆక్రమిస్తూ వ్యాపారం కొనసాగిస్తుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కాలనీలోని ఎస్‌బీఐ కాంప్లెక్స్ వెనుక భాగంలో రహదారిపై నిర్వహిస్తున్న టిఫిన్ సెంటర్లతో వాహన దారులు పాట్లు పడుతున్నారు. రోడ్డుకిరువైపులా వాహనాలు నిలిపివేయడంతో పాటు రోడ్డు మధ్యలో నిలబడి తినడం, డిస్పోజల్ ప్లేట్లు, గ్లాసులు ఎక్కడ పడితే అక్కడ వేయడంతో అసౌకర్యం కలుగుతోందని స్థానికులు వాపోతున్నారు.

ఇబ్బంది పడుతున్న రోగులు

ఇరుకైన సందులతో కనీసం అంబులెన్స్ కూడా దూరలేని పరిస్థితి ఉన్న డాక్టర్స్ కాలనీలో ఆస్పత్రుల నిర్వహణ కష్టంగా మారింది. ఈ నేపథ్యంలో సమీపంలోని రెడ్డీకాలనీలో ఆస్పత్రులను ఏర్పాటు చేస్తున్నారు. ఇటీవల నాలుగైదు ప్రధాన ఆస్పత్రులు రెడ్డీకాలనీలో ప్రారంభించారు. రహదారులన్నీ ఇడ్లీబండ్లు, కర్రీ పాయింట్లతో నిండిపోవడంతో ఆయా ఆస్పత్రులకు రాలేక రోగులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించాలని స్థానికులు కోరతున్నారు.

ప్రజలకు అసౌకర్యం కలిగించొద్దు



రహదారులను ఆక్రమించుకుని వ్యాపారం చేయడం చట్టవిరుద్ధం. చిరువ్యాపారులైనా, పెద్ద వ్యాపారులైనా నిబంధనలు పాటిం చాలి. పట్టణ ప్రజలకు, వాహనదా రులకు అసౌకర్యం కలిగిస్తే అవసరమైన చర్యలు తీసుకుంటాం. ఆహార పదార్థాలను విక్రయించే వారు శుచి, శుభ్రత పాటించాలి, జాగ్రత్తలు పాటించకపోతే ప్రజారోగ్యంపై ప్రభావం పడుతుంది.

● శ్రీనివాస్, మునిసిపల్ కమిషనర్, మిర్యాలగూడ.

రోడ్డుపైకి చెట్ల కొమ్మలు.. వెళ్లేందుకు వాహనదారులు తంటాలు



ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వెళ్లే మార్గంలో రోడ్డుపైకి వస్తున్న కొమ్మలు

నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని ఎన్నెస్పీ క్యాంపులో పెరిగిన పచ్చదనం ప్రజలకు కొంత అసౌకర్యం కలిగిస్తోంది. టూటౌన్ పోలీస్ స్టేషన్ నుంచి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం మీదుగా మునిసిపల్ కార్యాలయానికి వెళ్లే మార్గంలో పచ్చదనంతో అభివృద్ధి చేశారు. ఇరువైపులా పెరిగిన మొక్కలు, చెట్ల కొమ్మలు రోడ్డు మీదకు విస్తరించడంతో వాహనదారులు అసౌకర్యానికి గురవుతున్నారు. పచ్చదనాన్ని పెంచి పోషించడం అవసరమే అయినప్పటికీ, మొక్కలకు ప్రూనింగ్ చేయించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

● (ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడ టౌన్)

నాణ్యత పాటించాలి



మోత్కూరు అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): నాణ్యతా ప్రమాణాలకు లోబడి ఉన్న ధాన్యం కొనుగోలు చేయాలని వ్యవసాయ అధికారి వెంకటరమణారెడ్డి అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మార్కెట్ నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఆటోమెటిక్ ప్యాడి క్లినర్ ద్వారా నిర్వహిస్తున్న ధాన్యం శుభ్ర పరిచే ప్రక్రియను గమనించారు. వరి తేమ శాతం, నాణ్యత ప్రమాణాలను పరిశీలించారు. నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం వచ్చిన ధాన్యాన్ని తూకం వేయాలని సీఈవోకు సూచించారు. తేమ శాతం తగ్గే విధంగా, నాణ్యమైన ధాన్యం మార్కెట్‌కు వచ్చేలా జాగ్రత్తలు తీసుకోవాలని రైతులను కోరారు. రైతులు ఇబ్బంది పడకుండా, ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సాంకేతిక వ్యవసాయ అధికారి శ్రీనివాసులు, నాణ్యత పరిశీలన అధికారి గోపినాథ్, ఏఈవో సింహప్రసాద్, సీఈవో వరలక్ష్మీ, సెంటర్ ఇన్‌చార్జి సంధ్య, నాగేష్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లలో దివ్యాంగులకు ప్రాధాన్యమివ్వాలి

మోతె,అక్టోబరు22(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో దివ్యాంగులకు ప్రాధాన్యమివ్వాలని దివ్యాంగుల హక్కుల రాష్ట్ర నాయకుడు గిద్దె రాజేష్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన దివ్యాంగుల సమావేశంలో మాట్లాడారు. అనంతరం తహసీల్దార్ వెంకన్నకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో విజయ్, సుధాకర్, ఈదయ్య బాబు, బొర్ర సునీల్, లింగయ్య యాదవ్ పాల్గొన్నారు.

స్కావెంజర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుమలగిరి, అక్టోబరు22(ఆంధ్రజ్యోతి): తిరుమలగిరి పట్టణంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో స్కావెంజర్ పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవో శాంతయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉద్యోగానికి 7వతరగతి ఉత్తీర్ణులైన మహిళలు, 25నుంచి 50 ఏళ్లలోపు వారు మాత్రమే అర్హులని పేర్కొన్నారు ఈనెల 25వ తేదీలోపు ఎమ్మార్సీ భవనంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి



మోతెలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న తహసీల్దార్ వెంకన్న, ఎంపీడీవో ఆంజనేయులు,ఎస్‌ఐ అజయ్

తిరుమలగిరి/పెన్‌పహాడ్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి) : మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో హుజూర్‌నగర్‌లో ఈ నెల 25వ తేదీన నిర్వహించనున్న మెగా జాబ్‌మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని తిరుమలగిరి, పెన్‌పహాడ్ తహసీల్దార్లు హరిప్రసాద్, లాలునాయక్ సూచించారు. ఆయా మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం నిరుద్యోగులకు నిర్వహించిన అవగాహన సదస్సుల్లో వారు మాట్లాడారు. పదో తరగతి పాస్, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, ఎంబీఏ, బీటెక్, పీజీ ఫార్మసీ చదివిన 18 నుంచి 40 ఏళ్ల వయస్సు కలిగిన వారు హాజరుకావచ్చన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ రంజిత్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ రాధ ఉన్నారు.

● మోతె : హుజూర్‌నగర్‌లో ఈనెల 25న నిర్వహించనున్న మెగా జాబ్‌మేళా పోస్టర్‌ను స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ వెంకన్న, ఎంపీడీవో ఆంజనేయులు బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జాబ్‌మేళాకు మోతె పోలీస్‌స్టేషన్ వద్ద నుంచి వాహనాలు వెళ్తాయని నిరుద్యోగులు వినియోగించాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ అజయ్‌కుమార్, రెవెన్యూ, కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రజల మన్ననలు పొందాలి : మంత్రి ఉత్తమ్



గ్రూప్స్ విజేతలతో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

కోదాడటౌన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి) : గ్రూప్ పరీక్షల్లో ఉద్యోగం పొందిన యువత ప్రజల మన్ననలు పొందాలని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి సూచించారు. మేళ్లచెర్వుకు చెందిన రాజశేఖర్‌రెడ్డి ఇటీవల విడుదలైన గ్రూప్-1 ఫలితాల్లో సీటీవో ఉద్యోగానికి, కోదాడ మునిసిపాలిటీ పరిధిలోని లక్ష్మీపురానికి చెందిన కిసాన్‌సెల్ పట్టణ అధ్యక్షుడు షేక్‌ముస్తాఫా, కుమార్తె షేక్ సమీనా గ్రూప్-2లో ఏఎస్‌వోగా ఉద్యోగం సాధించారు ఇరువురు బుధవారం కోదాడలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా మంత్రి వారిని అభినందించారు.

స్వేరోస్ డే సందర్భంగా పచ్చదనం పరిశుభ్రత

కోదాడ రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కాపుగల్లు గ్రామంలో బుధవారం స్వేరోస్ డే సందర్భంగా క్లీన్ అండ్ గ్రీన్ నిర్వహించారు. ఈ సందర్భంగా సుప్రీం స్వేరోఎస్ ప్రవీణ్‌కుమార్ ఆదేశాలతో చీఫ్ కన్వీనర్ బల్గూరి దుర్గయ్య సూచనతో గ్రామంలో రోడ్ల వెంట పిచ్చి మొక్కలను తొలగించి, రోడ్లను శుభ్రం చేశారు. అనంతరం స్వేరోస్ రాష్ట్ర నాయకుడు చెరుకుపల్లి కిరణ్ పాల్గొని మాట్లాడుతూ 2012 అక్టోబరు 22న ఏర్పడిన స్వేరోస్ నెట్‌వర్క్ తెలుగు రాష్ట్రాలతో పాటు వివిధ రాష్ట్రాల్లో అనేక సేవా కార్యక్రమాలు చేస్తుందని, అక్షరం, ఆరోగ్యం, ఆర్థికం, ఆత్మగౌరవం అనే నినాదంతో పనిచేస్తుందని తెలిపారు. అలాగే విశ్రాంత ఐఏఎస్ దివంగత ఎస్ఆర్ శంకరన్‌కు స్వేరోస్ నాయకులు ఈ సందర్భంగా నివాళులర్పించారు.

ఏపీ ట్యాక్సీ వాహనాలపై చర్యలు తీసుకోవాలి

కోదాడ రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా రిజిస్ట్రేషన్ ట్యాక్సీలను రాష్ట్రంలో తిప్పుతున్న ట్యాక్సీ డ్రైవర్లపై చర్యలు తీసుకోవాలని స్థానిక ట్యాక్సీ డ్రైవర్లు బుధవారం ఎంవీ ఐకి వినతిపత్రం అందజేశారు. ఆంధ్రా రిజిస్ట్రేషన్‌తో ఉన్న సుమారు 15కి పైగా తుపాను వాహనాలను కోదాడ-హైదరాబాద్, కోదాడ-విజయవాడకు నడుపుతున్నారని పేర్కొన్నారు. దీంతో తెలంగాణ ట్యాక్సీ డ్రైవర్లు తీవ్రంగా నష్టపోతున్నారని వివరించారు. ఆంధ్రా ట్యాక్సీ డ్రైవర్లు తనిఖీ సమయంలో ఆంధ్రా నంబర్ ప్లేట్ తీసి తెలంగాణ నెంబర్ ప్లేట్లు ఏర్పాటు చేస్తున్నారని వారు ఆరోపించారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ఎంవీఐ జిలానీకి విజ్ఞప్తి చేశారు. ఎంవీఐ స్పందిస్తూ ట్యాక్సీ డ్రైవర్లపై తప్పకుండా చర్యలు తీసుకుంటామని, ఆధారాలు సమర్పించాలని కోరారు.

దళారీ, మిల్లర్ల దోపిడీ నుంచి రైతులను కాపాడాలి

మఠంపల్లి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఐకేపీ కేంద్రాలను తక్షణమే ప్రారంభించి ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు భూక్యపాండునాయక్ అన్నారు మండల కేంద్రంలో పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల వ్యాప్తంగా వానకాల వరి కోతలు ప్రారంభమయ్యాయని తెలిపారు. దళారులు, మిల్లర్లు రూ.2,400లకే సన్నరకం ధాన్యం కొనుగోలు చేస్తున్నారని ఈ ధరతో రైతు పెట్టి న పెట్టుబడులకు ఆమోదయోగ్యం కాదని కనీసం క్వింటాకు రూ.3 వేలతో కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు చోద్యం చూడకుండా రైతులను మిల్లర్లు, దళారీల భారీ నుంచి రైతులను కాపాడాలని ఆయన కోరారు. సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి మాలోతుబాలునాయక్, జగన్మోహన్‌రెడ్డి, సయ్యద్ రన్‌మియా, రాము, హరి, శంభయ్య పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందన



కబడ్డీ పోటీలకు ఎంపికైన భగవాన్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

మేళ్లచెర్వు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి) : జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన సాంఘిక సంక్షేమ గిరిజన పాఠశాల విద్యార్థి కుర్రభగవాన్‌ను మండల విద్యాధికారి వెంకట్‌రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ఇటీవల సంగారెడ్డి జిల్లా పటాన్‌చెర్వులో నిర్వహించిన అండర్-14 పోటీల్లో భగవాన్ ఉత్తమ ప్రదర్శనతో జాతీయ జట్టుకు ఎంపిక కావడం అభినందనీయమన్నారు. అదేవిధంగా జాతీయ జట్టులో ప్రతిభ చూపి రాష్ట్రానికి, జిల్లాకు పేరు తేవాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో గిరిజన పాఠశాల ప్రధానోపాధ్యాయులు మధుకర్, వైస్ ప్రిన్సిపాల్ ఉపాధ్యాయులు, నరపరెడ్డి, జట్టు కోచ్ నాగేశ్వరరావు, వ్యాయామ ఉపాధ్యాయురాలు, రంగారావు, లక్ష్మీ, రాజ్యం ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్థానం 'పది'లం కోసం

(5వ పేజీ తరువాయి)

ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. చదువులో వెనకబడిన విద్యార్థులను గుర్తించి ఉదయం, సాయంత్రం వారికి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ముఖ్యం గా జిల్లా ప రిషత్, కేజీబీవీ, ఆదర్శ, ఎయిడెడ్, పాఠశాలల్లో చదివే పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. జిల్లాలో జడ్పీ ఉన్నత పాఠశాలు 182, ఆదర్శ పాఠశాల లు 9, కేజీబీవీ పాఠశాల లు 18 ఉండగా వీటిలో 5,345 మంది పదో తరగతి విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వీరికి ప్రతిరోజూ ఒక ఉపాధ్యాయుడు వారి పాఠశాలల్లో ప్రత్యేక తరగతి నిర్వహిస్తున్నారు. ఈ తరగతుల్లో విద్యార్థులు ఏ విభాగంలో వెనకబడి ఉన్నారు, ముఖ్యమైన అంశాలను చదివి, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో చర్యలు తీసుకుంటారు.

శంకుస్థాపన చేశారు..ప్రారంభం మరిచారు

» చింతలపాలెం మండలంలో ఏడాది క్రితం రోడ్ల మరమ్మతుకు నిధులు మంజూరు

» పనులు ప్రారంభించడంలో అధికారులు, నిర్లక్ష్యం

మండలంలోని పలు గ్రామాల మధ్య రోడ్లు అస్తవ్యస్తంగా మారడంతో మరమ్మతు, రోడ్ల వెడల్పు కోసం ప్రభు త్వ నిధులు మంజూరు చేసింది. గతేడాది నవంబరులో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి పనులకు శంకుస్థాపన చేశా రు. కానీ పనులు ప్రారంభించడంలో అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వస్తు న్నాయి. అంతేకాకుండా రోడ్ల వెంట ఉన్న కంపచెట్లు తొలగించకపోవడంతో గత వేసవిలో కిష్టాపురం నుంచి మేళ్లచెర్వు వస్తున్న వ్యక్తికి కంపచెట్లలో నుంచి గేదెలు ఒక్కసారిగా రోడ్డు మీద రావడం గమనించక పోవడంతో గేదెలకు తగిలి మృతి చెందాడు.

- (ఆంధ్రజ్యోతి- చింతలపాలెం)



మండలంలో అధ్వానంగా తయారైన రోడ్డు

చింతలపాలెం నుంచి రేవూరు గ్రామాల మధ్య డబుల్ రోడ్డు కోసం రూ.20 కోట్లు, పీఆర్ సిమెంట్ క్రాస్ రోడ్డు నుంచి కిష్టాపురం క్రాస్ రోడ్డు వరకు 10.5 కిమీలు రోడ్డు వెడల్పు పనులకు రూ.15కోట్లు, మేళ్లచెర్వు నుంచి చింత్రియాల రోడ్డు, మేళ్లచెర్వు నుంచి 8.6 కిమీ రోడ్డు, పటిష్ట పర్చడానికి 1.4కిమీ రోడ్డు వెడల్పు చేసే పనులకు రూ.10 కోట్లు నిధులు మంజూరయ్యాయి. టెండర్ల ప్రక్రియ కూడా పూర్తయ్యింది. రోడ్డు పనులు ప్రారంభించాలని ఎన్నిసార్లు అధికారులను వేడుకున్నా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. రోడ్డుపై భారీ గుంతలు పడడంతో ప్రయాణ సమయం పెరగడంతో పాటు అత్యవసర సమయంలో ఈరోడ్లపై ప్రయాణించడం కష్టంగా ఉందని ప్రజలు వాపోతున్నారు. అధికారులు రోడ్లకు మరమ్మతు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.ఈ రోడ్డు నిర్మాణ పనుల జాప్యంపై ఆర్‌అండ్‌బీ, ఏఈ డీఈని వివరణ కోసం పలుమార్లు ఫోన్ చేసినా వారు స్పందించలేదు.

పనులను వెంటనే ప్రారంభించాలి



మండలంలో రోడ్లు అధ్వానంగా మారడంతో ఏడాది క్రితం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చొరవతో నిధులు మంజూరు చేయించి శంకుస్థాపన చేశారు. కానీ ఆ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అనేక మంది ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు చొరవ తీసుకుని మరమ్మతు పనులు చేపట్టాలి.

-శ్రీనివాసరావు, మాజీ వైస్ ఎంపీపీ, చింతలపాలెం

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ఆత్మకూర్ (ఎస్), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఏనుబాముల కందగట్ల, మంగలితండాల్లో సంఘ బంధం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలు సంఘం అధ్యక్షురాలు నాగలక్ష్మి ప్రారంభించారు. కార్యక్రమంలో సీసీ, సంఘ బంధం సభ్యులు, నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

రజక సంఘం తొండ గ్రామ కమిటీ ఎన్నిక

తిరుమలగిరి రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రజక సంఘం తొండ గ్రామ కొత్త కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా ఓ.యాదగిరి, సలహాదారులుగా ఓడపెల్లి వెంకన్న, పొరెల్ల రామకృష్ణ, అధ్యక్షుడిగా ఓడపెల్లి నరేష్, ఉపాధ్యక్షుడిగా పి.బుచ్చయ్య, వి. క్రిష్ణ, ఎల్లయ్య, శ్రీను, ప్రధాన కార్యదర్శిగా ఓ. రాజు, సహాయ కార్యదర్శిగా ప్రవీణ్, అశోక్, వెంకన్న, సందీప్, వేణు, కోశాధికారిగా పి. లక్ష్మయ్య, ప్రచార కార్యదర్శిగా ఓ.గణేష్, కార్యవర్గ సభ్యులుగా సోమనర్సయ్య, వెంకన్న, సమ్మయ్య, మహేష్, కిరణ్, వంశీ, సోమేల్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సోమనర్సయ్య, వెంకన్న, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మోతెలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న పంచాయతీ కార్మికులు

మోతె, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి) : పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించకుండా ప్రభుత్వం కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తుందని కార్మికుల సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చిట్యాల రవిచంద్ర అన్నారు. మండల కేంద్రంలో బుధవారం పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వంపై ఒత్తిడి చేసేందుకు ఈ నెల 24,25వ తేదీన పంచాయితీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ)ఆధ్వర్యంలో నిర్వహించనున్న రాష్ట్రమహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. మహబూబాద్ జిల్లా గార్ల మండలంలో నిర్వహించే సభకు కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలన్నారు. మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్మికులు జలగం తిరుపయ్య, గురిజాల స్కైలాబ్, గురువయ్య, సైదులు పాల్గొన్నారు.

సీఎం, మంత్రులపై అనుచిత వ్యాఖ్యలు తగవు



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ తిరుమలగిరి మండలాధ్యక్షుడు నరేష్

తిరుమలగిరి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): సీఎం, ఎంపీ, మంత్రులపై తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ అనుచిత వ్యాఖ్యలు తగవని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వై నరేష్ అన్నారు. తిరుమలగిరి మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం స్థానిక నా యకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే కిషోర్ కుమార్ తుంగతుర్తిలో చేసిన అన్యాయాలు, అక్రమాలతో విసిగిపోయిన ప్రజలు ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పారన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, ఎంపీ కిరణ్ కుమార్ రెడ్డి, మంత్రులు కొండా సురేఖ, అడ్లూరి లక్ష్మణ్‌పై చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని, వెంటనే క్షమాపణ చె ప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వివిధ మండలాల అధ్యక్షులు నాగం సుధాకర్‌రెడ్డి, దొంగరి గోవర్దన్, జుమ్మిలాల్, పానుగంటి నరసింహారెడ్డి, యాదగిరి, లింగయ్య, అబ్బాస్, తదితరులు పాల్గొన్నారు.

కపాస్ కిసాన్ యాప్‌పై అవగాహన



చింతలపాలెం : రైతులకు అవగాహన కల్పిస్తున్న దొండపాడు క్లస్టర్ ఏఈవో దుర్గాభవాని

చింతలపాలెం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి) : మండలంలోని తమ్మారం, శోభనాద్రిగూడెం, రేబల్లె, పిక్లనాయక్ తండా గ్రామాల్లో పత్తి రైతులకు కిసాన్ కపాస్ యాప్‌పై చింతలపాలెం, దొండపాడు క్లస్టర్ ఏఈవోలు సంధ్య, దుర్గభవాని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా స్లాట్ బుకింగ్ పేమెంట్ ట్రాకింగ్, ఆధార్ భూమి రికార్డుల ద్వారా సులభంగా నమోదు చేసుకోవడం వంటి సదుపాయాలు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పత్తి రైతులు పాల్గొన్నారు.

● పెన్‌పహాడ్ : మండలంలోనిసింగారెడ్డిపాలెం గ్రామంలో బుధవారం పత్తి రైతులకు కిసాన్ కపాస్ యాప్‌పై వ్యవసాయాధికారులు అవగాహన కల్పించారు. రైతులు స్లాట్ బుక్ చేసుకున్న తేదీన మా త్రమే పత్తిని మార్కెట్‌కు తీసుకువెళ్లాలన్నారు. కార్యక్రమంలో ఏవో బి.అనిల్‌కుమార్, ఏఈవో పి.వికాస్, తమ్మనబోయిన మాధవరావు తదితరులు ఉన్నారు.

ప్రజల్లో చైతన్యానికే పోలీస్ భరోసా



సూర్యాపేట పట్టణంలో 23 వవార్డు సమావేశంలో మాట్లాడుతున్న సీఐ వెంకటయ్య

సూర్యాపేటక్రైం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రజలను చైతన్యం చేయడానికే పోలీస్ భరోసా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సూర్యాపేట పట్టణ సీఐ వెంకటయ్య అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని 23వవార్డు రాజీవ్‌నగర్ చౌరస్తా సమీపంలో పోలీస్ ప్రజా భరోసా కార్యక్రమాన్ని నిర్వహించి మాట్లాడారు. పట్టణంలో సామాజిక అంశాలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రజల సహకారం లేకుండా పోలీస్ న్యాయవ్యవస్థ పటిష్టంగా పనిచేయడం సాధ్యం కాదని తెలిపారు. ప్రజలంతా చట్టాన్ని గౌరవిస్తూ అన్యాయాన్ని సహించకుండా ముందుకు వస్తే పోలీస్ శాఖ మేమున్నామంటూ భరోసా ఇస్తుందన్నారు. కార్యక్రమంలో వన్‌టౌన్ ఎస్‌ఐ. మహేందర్ నాథ్, పోలీస్ సిబ్బంది సొందపాషా, డార్విన్, సైదా, సాయిరాం, శ్రీకాంత్, సంజయ్, వీరస్వామి, ఈశ్వర్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన ఉండాలి

గరిడేపల్లి : సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని హుజూర్‌నగర్ సీఐ జి.చరమందరాజు అన్నారు. మండలంలోని కుతుబ్‌షాపురంలో నిర్వహించిన పోలీస్ ప్రజా భరోసా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మహిళలు, వృద్ధులు సైబర్ నేరగాళ్లకు లక్ష్యంగా మారే అవకాశం ఎక్కువగా ఉందని ఆయన హెచ్చరించారు. మైనర్ బాలికలతో అసభ్యంగా ప్రవర్తిస్తే పోక్సో చట్టం కింద తీవ్రమైన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన అన్నారు. యువత ఆన్‌లైన్, డేటింగ్స్ యాప్స్ వలలో పడకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక ఎస్సై చలికంటి నరేష్ పోలీస్ సిబ్బంది. గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పెంపుడు కుక్కకు శస్త్ర చికిత్స



కుక్కకు శస్త్ర చికిత్స చేస్తున్న పెంటయ్య

కోదాడ రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : హుజూర్‌నగర్ పట్టణంలోని ఉత్తమ్ పద్మావతి కాలనీకి చెందిన విలాసకవి నరసరాజుకు చెందిన కుక్కకు పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ పెంటయ్య బుధవారం శస్త్ర చికిత్స చేశారు. కుక్కకు నెలరోజులుగా చెవి దగ్గర ఇన్‌ఫెక్షన్ సోకడంతో తీవ్రజ్వరంతో బాధపడుతూ ఆహారం తీసుకోవడం లేదు. దీంతో స్థానిక ప్రాంతీయ పశువైద్యశాలకు తీసుకురాగా పరీక్షించి, బుధవారం శస్త్ర చికిత్స చేశారు. ఇష్టంగా పెంచుకున్న కుక్క ప్రాణాలు కాపాడిన వైద్యుడు పెంటయ్యకు విలాసకవి నరసరాజు కృతజ్ఞతలు తెలిపారు.

కార్తీకమాస పూజలు ఆరంభం



ఉండ్రుగొండలో మంగళసూత్రం చూపుతున్న పురోహితులు

హుజూర్‌నగర్ అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం మొదటిరోజు సందర్భంగా పట్టణంలోని పార్వతీ సహిత భీమలింగేశ్వరస్వామి ఆలయం, బూరుగడ్డలోని నల్లకట్ట సంతాన కామేశ్వరి శంభులింగేశ్వరస్వామిఆలయాల్లో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆకాశ దీపం వెలిగించారు. కార్యక్రమాల్లో గజ్జి ప్రభాకర్, గుజ్జుల కొండారెడ్డి, కీతా మల్లికార్జున్‌రావు పాల్గొన్నారు.

● చివ్వెంల : మండలంలోని ఉండ్రుగొండలో లక్ష్మీనరసింహస్వామి శ్రీదేవి, భూదేవిల కల్యాణం శాస్త్రోక్తంగా అత్యంత వైభవంగా జరిపించారు. ఆలయ అర్చకులు శ్రీమాన్ అరవిందాచార్యుల ఆధ్వర్యంలో కల్యాణోత్సవం జరిపించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో కల్యాణాన్ని తిలకించారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలతో పాటు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రాంగణంలో కొలువుదీరిన ఉమా మహేశ్వర స్వామి ఆలయంలో ప్రతిరోజు సరస్వతిభట్ల ఆనంద శర్మ నేతృత్వంలో రుద్రాభిషేకం నిర్వహిస్తారని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆలయ అభివృద్ధి కమిటీ తెలిపింది.

● మేళ్లచెర్వు : మండల కేంద్రంలోని ఇష్టకామేశ్వరి సమేత స్వయంభూ శంభులింగేశ్వరస్వామి వారి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు ప్రారంభించారు. స్వామివారికి ప్రత్యేక రుద్రాభిషేకం నిర్వహించిన అర్చకులు పూజల్లో పాల్గొనేందుకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.కార్యక్రమంలో ఆలయ అర్చకులు విష్ణువర్ధన్‌శర్మఆలయ ఈవో నాగేళ్ల శంభిరెడ్డి, ఆలయ చైర్మన్ శాగంరెడ్డి శంభిరెడ్డి, కమిటీ సభ్యులు, సత్యనారాయణరెడ్డి, కమతం శ్రీనివాసరావు, గోవింద్‌రెడ్డి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రహదారి ఇలా.. ప్రయాణ ఎలా..?



మఠంపల్లి : చౌటపల్లి- పెదవీడు గ్రామాల వద్ద అధ్వానంగా ప్రధాన రహదారి

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మఠంపల్లి మండలం మట్టపల్లి లక్ష్మీనరసింహస్వామి ఆలయం నుంచి హుజూర్‌నగర్ వరకు ఉన్న ప్రధాన రహదారి గుంతలు పడి అధ్వానంగా తయారైంది. మండలంలోని సుల్తాన్‌పురంతండా, గుర్రంబోడుతండా స్టేజీ, పెదవీడు, చౌటపల్లి, బక్కమంతులగూడెం, ఎర్రగ ట్టు తదితర గ్రామాల ప్రధాన రహదారిపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడడంతో ప్రయాణికులు, వాహనదారులు, విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. మండలంలో పలు పరిశ్రమలకు చెందిన లారీలతో పాటు తెలుగు రాష్ట్రాల నుంచి భారీ సంఖ్యలో వాహనాలు మట్టపల్లి రహదారిపై రాత్రింబవళ్లు తిరుగుతుండటం, గుంతల్లో నీరు ఆగడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ రోడ్డును మరమ్మతులు చేసేందుకు సంబంధిత శాఖ అధికారులు ముందుకు రావట్లేదు. దీంతో రోజురోజు అధ్వానంగా మారుతోంది. ఇప్పటికైనా అర్‌అండ్‌బీ అధికారులు స్పందించి భయంకరంగా ఉన్న గుంతలను పూడ్చి ప్రయాణికుల ఇబ్బందులను తొలగించాలని వాహనదారులు, ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. (ఆంధ్రజ్యోతి- మఠంపల్లి)